నేటి కందం-నేటికి అందం

ఒదుగుచు వ్యోమమ్మునకై
ముదముల నందించు నగరమును స్థాపింపన్
విదుడగు శ్రీధర్ బాబుకు
పదునాలుగు కంపెనీలు ప్రతిపాదించెన్ !!

(హైదరాబాద్ లోని పదునాలుగు స్పేస్ కంపెనీలు హైదరాబాద్ లో "స్పేస్ సిటీ" ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్ బాబును కోరగా వారు పరిశీలించడానికి నిర్ణయం తీసుకున్నారు. దీనివలన మన హైదరాబాద్ స్పేస్ సిటీ గా మారే అవకాశాలు ఉన్నాయని దాని వలన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అందరూ సంతోషిస్తున్నారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

ప్రశ్నించుడు మంచిదే
పరనిందే తప్పు
బట్టతలలో వెంట్రుకలు
బారెడంటే ముప్పు.
ప్రభుత్వం తప్పొప్పులు
ప్రతిపక్షం బేరీజులు
అపనిందలైతే జనం
ఆలోచించే ఈరోజులు

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 1-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:25 పేజీలు:6 వెల: రూ.1/-


## జోగులాంబ రైల్వే స్టేషన్‌కు మహర్దశ

–రైల్వే గేట్ వద్ద రూ.45 కోట్లతో ఆర్‌ఓబీ..
–రద్దీకి చెక్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నల్గొండ, ఆగష్టు 31:ప్రపంచ ప్రసిద్ధ శక్తిపీఠాల్లో ఒకటైన ఆలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించే దిశగా రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. ఆలంపూర్‌లోని శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వే స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. దాదాపు రూ.7 కోట్ల వ్యయంతో చేపట్టిన స్టేషన్ ఆధునీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు.

జోగులాంబ ఆలయానికి సమీపంలో ఉన్న ఈ రైల్వే స్టేషన్‌ను స్థానిక ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక రూపకల్పనతో అభివృద్ధి చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఆలయ దర్శనానికి తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, విదేశాల నుంచి కూడా భక్తులు వస్తుంటారని పేర్కొన్నారు. ఆధునీకరణ పనులు పూర్తయిన తర్వాత భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

**రూ.45 కోట్లతో రైలు వంతెన**

రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేట్ వద్ద తరచూ ఏర్పడే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేలా రైలు వంతెన నిర్మాణానికి రూ.45 కోట్లు కేటాయించనున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రైలు వంతెన నిర్మాణం పూర్తయితే రైల్వే గేట్ వద్ద వాహనాల రాకపోకలకు ఏర్పడే అంతరాయాలు తగ్గుతాయని చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులతో పాటు స్థానిక ప్రజలకు కూడా ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారుతుందని పేర్కొన్నారు.

**రైల్వే అభివృద్ధికి భారీగా నిధులు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల విలువైన పలు రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచేందుకు రెండో, మూడో, నాలుగో లైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వివరించారు.

తెలంగాణలో రైల్వే మార్గాల విద్యుదీకరణ పూర్తిస్థాయిలో పూర్తయిందని కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే మౌలిక వసతులను మరింత ఆధునీకరించడం ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సరకు రవాణా సామర్థ్యాన్ని కూడా పెంచే చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**భక్తులకు మరింత సౌకర్యం**

జోగులాంబ ఆలయం శక్తిపీఠంగా ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగి ఉన్న నేపథ్యంలో ఆలంపూర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. స్టేషన్ ఆధునీకరణతో పాటు రైలు వంతెన నిర్మాణం పూర్తయితే ఆలయ పరిసరాల్లో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా ఆలంపూర్‌కు వచ్చే యాత్రికులకు మెరుగైన అనుభూతి కల్పించడమే లక్ష్యమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## పదవి విరమణ పొందిన ఉద్యోగులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

ములుగు ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): పోలీస్ డిపార్ట్మెంట్లో తమ సర్వీస్ పూర్తి చేసుకుని ఈరోజు పదవీ విరమణ చేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ నందు విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సారమల్లు, ములుగు ఖూ నందు విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఇమ్మాన్యుయేల్ గార్లకు జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ లో ములుగు జిల్లా అడిషనల్ ఎస్పీ సదానందం గారు శాలువా కప్పి, జ్ఞాపికను బహూకరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో భాగంగా ములుగు సీఐ సురేష్ మాట్లాడుతూ 42 సంవత్సరాల సుదీర్ఘ సర్వీస్ అనంతరం రిటైర్ అవుతున్న అధికారులు ఇద్దరు తమ కుటుంబాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వారికి అవసరం వచ్చిన తమను సంప్రదిం చాలని తెలియజేశారు. అనంతరం ఆర్ ఐ స్వామి మాట్లాడుతూ రిటైర్మెంట్ అనేది జీవితంలో ప్రతి ఒక్కరికి తప్పదని ఈరోజు పదవి విరమణ పొందుతున్న ఈ అధికారులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో జీవించాలని కాంక్షించారు.

ములుగు జిల్లా పోలీస్ సంక్షేమ సంఘానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు క్రాంతికుమార్ మాట్లాడుతూ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది యొక్క సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని ఈరోజు పదవి విరమణ చేస్తున్న అధికారుల యొక్క బెనిఫిట్స్ అందే వరకు కూడా తమ కృషి చేస్తూ ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. తదనంతరం ములుగు డిఎస్పి రవీందర్ గారు మాట్లాడుతూ 42 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఇద్దరు అధికారులు ఎన్నో ఆటుపోటులను ఎదు ర్కొని నక్సరిజం తీవ్రంగా ఉన్న రోజుల్లో ఎంతో కష్టపడి పని చేసి ఈరోజు డిపార్ట్మెంట్ ఉన్నత స్థానంలోకి వెళ్లడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇలాంటి వారి కృషి వల్లే నేడు తెలంగాణ పోలీస్ అత్యుత్తమ విధులు కనబరుస్తున్నారని తెలియజేశారు. ఈరోజు పదవి విరమణ పొందుతున్న ఈ అధికారులు వారి కుటుంబాలతో ఆయురారోగ్యాలతో కలిసి జీవించాలని ఆకాంక్షించారు. అటు తర్వాత డిఎస్పి డిసిఆర్బి కిషోర్ కుమార్ గారు మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అనేది కత్తి మీద సాము లాంటిది అని ఈ సుదీర్ఘ ప్రయాణంలో అధికారులకు అండగా నిలిచిన కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. వారు పదవి విరమణ పొందిన తర్వాత కూడా అదే విధంగా తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీ సదానందం గారు మాట్లాడుతూ× పోలీస్ కంట్రోల్ రూమ్ నందు విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సారమల్లు, ములుగు ఖూ నందు విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఇమ్మాన్యుయేల్ గారు లు పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా సేవలందించి సర్వీస్ పూర్తి చేసుకుని ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ విభాగంలో సుధీర్ఘ కాలంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని అన్నారు " పోలీసు రిటైర్ మెంట్ కేవలం వారి వృత్తికే, కాని వారి వ్యక్తిత్వానికి కాదు" అని కొనియాడారు.

## నేపాల్‌లో 900 దాటిన మృతుల సంఖ్య.. 4,000 మంది గల్లంతు

నేపాల్, ఆగష్టు 31: నేపాల్‌లో వరద మృతుల సంఖ్య 900 దాటిందని అక్కడి అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో గల్లంతైన వారి సంఖ్య 4,000 మందిపైనే ఉంటుందని అంచనా. ఇందులో 320 మంది విదేశీయుల అచూకీ కూడా లభించలేదు. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నేపాల్‌కు చెందిన ద నేషనల్ డిజాస్టర్ రిస్క్ రెడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ) అధికారుల ప్రకారం అనేక ప్రాంతాల నుంచి మృతదేహాల్ని సిబ్బంది గుర్తిస్తున్నారు.

మరోవైపు నేపాల్‌కు ఇంకా వరద ముప్పు పొంచి ఉంది. భోటెకోసి నది ఇంకా ఉప్పొంగుతుండటంతో స్థానికుల ఫోన్‌లకు ఇప్పటికే అలర్ట్ మెసేజ్‌లు అందాయి. ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. త్రిశూలి నదిలో కూడా నీటిమట్టం పెరుగుతోంది. ఈ నదిలో వరదకు ఇప్పటికే ఒక సస్పెన్షన్ బ్రిడ్జి కొట్టుకుపోయింది. తాజా పరిణామాలపై నేపాల్ ప్రధాని బాలెంద్ర షా కీలక ప్రకటన చేశారు. దేశం ఎప్పుడూ ఊహించని, హృదయవిదారకమైన విపత్తును ఎదుర్కొంటోంది అన్నారు.

వాతావరణం అనుకూలించకపోవడం వల్ల సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అన్నారు. ఇంకా వరద ప్రభావిత ప్రాంతాల్లో నదులు ఉప్పొంగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పరిస్థితులు అనుకూలంగా లేనందువల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వంటి అంశాల్లో స్పష్టత రావడం లేదన్నారు. అయినప్పటికీ ప్రజల ప్రాణాల రక్షణ కోసం అంకితభావంతో కృషి చేస్తున్నామని వివరించారు.

మరోవైపు మృతదేహాల్ని భద్రపరచడానికి, ఖననం చేయడానికి కూడా నేపాల్‌లో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నేపాల్‌కు ఇండియా, చైనా వంటి దేశాలు ప్రస్తుతం సహాయం అందిస్తున్నాయి.

## ఢిల్లీలో దారుణాలు.. మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి.. బస్సులో యువతిపై గ్యాంగ్ రేప్

న్యూఢిల్లీ, ఆగష్టు 31: దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటనలు జరిగాయి. కదిలే బస్సులో యువతిపై నిర్భయ తరహా అత్యాచార ఘటన జరిగింది. మరో ఘటనలో ఒక స్కూల్‌లో మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వివరాలివి.

**మూడేళ్ల చిన్నారిపై స్కూల్ బస్సు డ్రైవర్..**

ఢిల్లీలోని బవానా ప్రాంతంలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో నర్సరీ చదువుతున్న చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ దారుణానికి పాల్పడింది బస్సు స్కూల్ డ్రైవర్. మూడేళ్ల నర్సరీ విద్యార్థిని మర్మావయవాలపై గాయాలుండటాన్ని ఆగష్టు 19న చిన్నారి తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో ఆ గాయాలు ఎలా అయ్యాయని చిన్నారిని తల్లిదండ్రులు అడిగారు. స్కూల్‌లో ఒక బ్యాడ్ అంకుల్ తనకు రోజూ చాక్లెట్లు ఇచ్చి, ఇబ్బంది పెడుతున్నాడని చెప్పింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులకు జరిగిన విషయం అర్థమైంది.

వెంటనే వారు పోలీసులకు, స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆ పాపకు ఇంకా మాటలు కూడా సరిగ్గా రావు. ఆ చాక్లెట్లు ఇచ్చిన అంకుల్ ఎవరో చిన్నారి గుర్తించలేదు. అతడి గురించి స్పష్టమైన వివరాలు చెప్పలేకపోయింది. అయితే, స్కూల్‌లో పని చేసే సిబ్బందికి సంబంధించి సీసీటీవీ వీడియో దృశ్యాలు, ఫొటోగ్రాఫ్‌లు చూపించారు. వాటిలో నిందితుడిని ఆ చిన్నారి గుర్తించింది. నిందితుడిని బస్సు డ్రైవర్ వికాస్‌గా గుర్తించారు. చిన్నారి వాష్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో పాప వెంటే వెళ్లేవాడు. చాక్లెట్ల ఆశచూపి, అక్కడి మెట్లకిందికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.గతంలో నాలుగుసార్లు అలా చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డట్లు తేలింది. గతంలో కూడా పలువురు చిన్నారులకు నిందితుడు చాక్లెట్లు ఇవ్వడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డైంది. దీంతో ఆ ఘటనలపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. పాప ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. స్కూల్ ఆవరణలోనే వికాస్‌ను అరెస్టు చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కదిలే బస్సులో 16 ఏళ్ల యువతిపై**

మరో ఘటనలో.. కదిలే బస్సులో 16 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఢిల్లీలోని కాశ్మీరే గేట్ ఏరియాలోని ఖాళీగా ఉన్న ఒక స్లీపర్ బస్సులో ఈ ఘటన ఆగష్టు 4న జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లోని మణిపురి జిల్లాకు చెందిన 16 ఏళ్ల యువతి ఇంటి నుంచి చెప్పకుండా బయటకు వచ్చేసింది. తన ఊరు నుంచి నోయిడాలోని తన బంధువు దగ్గరికి వెళ్లాలనుకుంది. ఈ క్రమంలో ఒక బస్సు ఎక్కింది. అయితే, వర్షం, చీకటి కారణంగా మధ్యలోనే పారి చౌక్ ప్రాంతంలో పొరపాటున దిగేసింది. ఇదే సమయంలో అటు నుంచి ఒక స్లీపర్ బస్సు వెళ్తూ కనిపించింది.దీంతో ఆ బస్సును ఆపాల్సిందిగా యువతి సిగ్నల్ ఇచ్చింది. యువతి ఒంటరిగా ఉండటాన్ని ఆసరాగా చేసుకున్న బస్సు, డ్రైవర్.. తాము కూడా నోయిడాలోని సెక్టార్ 63కే వెళ్తున్నామని చెప్పారు. ఆమెను కావాల్సిన చోట దింపుతామని చెప్పి బస్సులో ఎక్కించుకున్నారు. యువతి బస్సు ఎక్కిన తర్వాత ఆమెపై బస్సు కండక్టర్, తర్వాత డ్రైవర్.. ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. అత్యాచారం అనంతరం యువతిని కాశ్మీర్ గేట్ సమీపంలో దింపేసి వెళ్లిపోయారు. అనంతరం బాధిత యువతి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బస్సు డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌ను అరెస్టు చేశారు. బస్సును సీజ్ చేశారు.

## చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

హైదరాబాద్, ఆగష్టు 31: నగరంలోని చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య కలకలం రేపుతోంది. కంది సాగర్(31) అనే రిమాండ్ ఖైదీ.. జైలు వాష్‌రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే గుర్తించిన జైలు సిబ్బంది హుటాహుటిన సాగర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఖైదీ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న సాగర్‌ను ఇటీవల నిజామాబాద్ జైలు నుంచి చంచల్‌గూడ జైలుకు బదిలీ చేశారు. ఈ ఘటనపై జైలు అధికారులు దర్యాప్తు చేపట్టారు. సాగర్ ఆత్మహత్యకు గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ భేటీ.. కీలక సమయంలో చర్చలు..



న్యూఢిల్లీ, ఆగష్టు 31: షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ద్వైపాక్షిక భేటీ నిర్వహించారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో సోమవారం ఈ సమావేశం జరిగింది. ఫిబ్రవరిలో ఇరాన్–అమెరికా యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరువురు నేతలు ప్రత్యక్షంగా కలుసుకోవడం ఇదే తొలిసారి

భారత్–ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల తాజా పరిస్థితిని ఇరువురు నేతలు సమీక్షించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసి, విస్తరించాల్సిన అవసరం గురించి చర్చించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న సమయంలో ఈ కీలక భేటీ జరగడం ఆసక్తికరంగా మారింది

అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూసివేత, అమెరికా ఆంక్షల కారణంగా భారత్ సహా పలు దేశాల వాణిజ్య కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. భారత్‌కు ఇరాన్ భౌగోళికంగా, వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలక దేశం. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షల నేపథ్యంలో మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖి చర్చలు జరపడం రెండు దేశాల భవిష్యత్ సహకారానికి కీలక పరిణామంగా మారింది

ఎస్‌సీఓ సదస్సు సందర్భంగా మోదీ ఇప్పటికే అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తో కూడా సమావేశమయ్యారు. రక్షణ, ఆర్థిక వ్యవహారాలు, ఫార్మా, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంపై ఇరువురు చర్చించారు. అలాగే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కూడా మోదీ భేటీ కావాల్సి ఉంది. అలాగే కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదీర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మోదీ పాల్గొననున్నారు.

## కౌశంబి టపాసుల పరిశ్రమలో పేలుడు.. ఏడుగురు మృతి.. పలువురికి గాయాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 31: ఉత్తర ప్రదేశ్‌లోని ఒక టపాసుల పరిశ్రమలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. కౌశంబి జిల్లాలోని టపాసుల పరిశ్రమలో పేలుడు కారణంగా ఏడుగురు మరణించారు. 24 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటన యూపీ, కౌశంబి జిల్లా, పిప్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మహ్మూద్‌పూర్‌లో సోమవారం జరిగింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

జిల్లా మెజిస్ట్రేట్ అమిత్‌పాల్ శర్మతోపాటు సీఐ శివాంగ్ సింగ్, ఇతర ఉన్నతాధికారులు దగ్గరుండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఘటనా స్థలంలోకి అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు భారీగా చేరుకున్నాయి. అలాగే, జేసీబీల్ని కూడా వినియోగిస్తున్నారు. సోమవారం ఉన్నట్లుండి టపాసుల పరిశ్రమలో పేలుడు సంభవించింది. దీంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ సమయంలో ఫ్యాక్టరీలో పాతికమందికి పైగా కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం. ఈ పేలుడు శబ్దాలు రెండు కిలోమీటర్ల వరకు వినిపించాయి.

పేలుడు తీవ్రత ఎంతగా ఉందంటే.. చుట్టుపక్కల 50 మీటర్ల పరిధిలోని అనేక ఇండ్లు కూడా ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం అధికారులు మంటల్ని ఆర్పి, బాధితుల్ని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయపడిన వారిని ప్రయాగ్‌రాజ్‌లోని ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. వారిలో ఒక మహిళ కూడా ఉంది. మృతులు, క్షతగాత్రులకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సహాయక చర్యలు పూర్తైన తర్వాతే ఈ విషయంలో స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు.

## హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ.50,016 విరాళం అందజేసిన ఏనుగు మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి హనుమాన్ ఆలయ అభివృద్ధికి ఏనుగు మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.50,016 విరాళాన్ని అందజేశారు. సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పర వెంకటరెడ్డికి ఈ మొత్తాన్ని అందించారు.ఆలయ అభివృద్ధికి సహకరించిన ఏనుగు మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ తరఫున అధ్యక్షుడు కొప్పర వెంకటరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించడం అభినంద నీయమన్నారు.కార్యక్రమంలో మిట్టపల్లి అనిల్‌రెడ్డి, విక్కుర్తి సాయిబాబు, వనపర్తి జగన్, విక్కుర్తి నారాయణ, రేగుల రాజేశం, బూర గణేష్, గుడిసె మనోజ్, అప్పవారి చక్రపాణి, నాగుల శంకర్, వనపర్తి గంగ య్య, దేశెట్టి ఆశయ్య, కొప్పర సంతోష్‌రెడ్డి, నల్ల సతీష్‌రెడ్డి, గుడిసె సదానందం, నల్ల తిరుపతిరెడ్డి, బొడ్డు కిషన్‌తో పాటు గ్రామ కుల సంఘాల పెద్దలు, యువత పాల్గొన్నారు.

# కనుమరుగు అవుతున్న ఉత్తరాలు రాసే కళ !

## (01 సెప్టెంబర్ "ప్రపంచ ఉత్తరాలు రాసే దినోత్సవం" సందర్భంగా)

పోస్ట్ కార్డు, ఇన్‌ల్యాండ్ కవర్, పోస్టల్ స్టాంపులను మరిచి పోయాం. పోస్టు డబ్బాలో ఉత్తరాలు వేయడం ఒక నాటి అనుభవం అయిపోయింది. వందల ఏండ్లుగా సమాచార వితరణకు వ్యక్తిగతంగా మాట్లాడడంతో పాటు సుదూర తీరాల ఆత్మీయులకు ఉత్తరాలు రాయడం అనే మార్గాలను అనుసరించాం. నేటి డిజిటల్ యుగంలో అంటర్నెట్ వేగానికి సాంప్రదాయ ఉత్తరాలు రాయడమనే ఆచారం కొట్టుకుపోయింది. క్రమంగా ఉత్తరాలు రాసే కళ మసకబారుతోంది. "ఉత్తరాలు రాయడమనే కళ" లేదా "ఆర్ట్ ఆఫ్ లెటర్ రైటింగ్"ను పోషించడం, మన అభిప్రాయాలను నిర్భయంగా చెప్పడం ఓ అద్భుతమైన నైపుణ్యం. మనం రాసే ఉత్తరాలను స్వీకర్తలు తమ జీవితకాలం పాటు అగ్రవధాన ఆస్తులుగా భద్రపరుచుకుంటారు. మనకు వచ్చిన అపూర్వ ఉత్తరాలను కూడా మనం దాచుకొని ఉన్నాం, అప్పుడప్పుడు వాటిని చదువుకొని గత స్మృతులను నెమరువేసుకుంటున్నాం. ఉత్తరాలు రాయడంతో మానవీయ బంధాలు బలపడతాయి.

### ప్రపంచ ఉత్తరాలు రాసే దినోత్సవం :

ఉత్తరాల ప్రాముఖ్యతను వివరించడం, ఉత్తరాలు రాసే కళ పట్ల అవగాహన కల్పించడం, మానవ సంబంధాలను మెరుగు పరుచుకోవడం లాంటి అంశాలను ప్రచారం చేయడానికి ప్రతి ఏట 01 సెప్టెంబర్ రోజున "ప్రపంచ ఉత్తరాలు రాసే దినోత్సవం" లేదా "వరల్డ్ లెటర్ రైటింగ్ డే" పాటించడం 2014 నుంచి ఆనవాయితీగా మారింది. నేటి యువతకు ఉత్తరాలు రాసే అలవాటు లేకుండా పోతున్నది. డిజిటల్ వేదికల్లో అర్థంపర్థం లేని సమాచారాలను వేగంగా పంపడం లేదా స్వీకరించడం మాత్రమే తెలిసి యువతలో ఆర్ట్ ఆఫ్ లెటర్ రైటింగ్ పట్ల అవగాహన లేకుండా పోతున్నదని గమనించి ఉత్తరాలకు పూర్వవైభవం కల్పించడానికి ఈ వేదికలను వినియోగించడం జరుగుతోంది. నేడు ఒక పెన్ను, పేపర్ తీసుకొని బాల్య మిత్రులకు లేదా మనల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయులు లేదా వ్యక్తులకు ఉత్తరం రాసి వారిని విస్మయ పరుస్తూ మీ సత్సంబంధాలను గుర్తు చేయండి. మీ మనసు లోతుల్లో దాగిన భావాలను వ్యక్తం చేయడం. ఉత్తరంలో రాసిన ప్రతి అక్షరం గ్రహీతకు సంతోషాల విందును పంచుతుంది. మన అభిప్రాయాలు, మన భావోద్వేగాలు, మన మధ్య నెలకొన్న చిన్న చిన్న భేదాభిప్రాయాలను వ్యక్తం చేయడానికి ఉత్తరాలు మాత్రమే ఉత్తమ సాధనాలు అని మరిచి పోరాదు.

### లెటర్ రైటింగ్ ఆర్ట్ లేదా ఉత్తరాలు రాసే కళ:

మన అభిప్రాయాలు, భావోద్వేగాలు, సమాచార వితరణలు, మానవీయ సంబంధాలు, వ్యక్తిగత అభిప్రాయాలు లాంటి అంశాలను స్పష్టంగా, సరళంగా, కళాత్మకంగా, అర్థవంతంగా, సులభ సరళిలో ఉత్తరాలను రాయడమనే నైపుణ్యాన్ని "ఆర్ట్ ఆఫ్ లెటర్ రైటింగ్" అని అంటాం. ఉత్తరాలు రాసే కళ ఒక రోజులోనే ఒక ఉత్తరంతోనో రాదు. దీనిని క్రమంగా అభివృద్ధి చేసుకోవాలి. అత్యంత ప్రభావితం చేసిన ప్రముఖులు రాసిన ఉత్తరాలను చదవడంతో కొన్ని మెలకువలు తెలుసుకోవచ్చు. మన రాసిన ప్రతి అక్షరం చదువరిని ఆకట్టుకోవాలి. నేటి యువత, బాలబాలికలకు ఉత్తరాలు రాయడమనే కళ పట్ల ఆసక్తిని పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మనం రాసిన ఉత్తరం, దానిని పొందిన వ్యక్తులు చిరకాలం ఆ ఉత్తరాలను దాచుకునే విధంగా ఉండాలి.

ఉత్తరం మానవ సంబంధాలు పెంచే ఓ అద్భుతమైన సాధనం. ఉత్తరం రాయడానికి లోతైన ఆలోచనలు చేస్తాం. మన వ్యక్తం చేయవలసిన భావాలను క్రమ పద్ధతిలో రాయడానికి ప్రయత్నం చేస్తాం. ప్రపంచ మానవాళిని ప్రభావితం చేసిన ప్రముఖుల ఉత్తరాలు నేటికీ ప్రజాదరణలో ఉన్నాయి. మన సమీప బంధువులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, పెద్దలతో మానవీయ సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఉత్తరాలు రాసే కళ ఉపకరిస్తుందని తెలుసుకొని వేచి నుంచే ఉత్తరాలు రాయడం ఒక అలవాటుగా చేసుకుందాం. ఉత్తరాలు రాస్తూ మన స్నేహితులు, బంధువులను సంతోష భావాక్షర సాగరంలో ముంచేద్దాం.



-మధుపాళీ
9949700037

# ఆపరేషన్ వజ్ర 2.0లో భాగంగా భారీ అంతర్రాష్ట్ర ఔషధాల అక్రమ తరలింపును అడ్డుకున్న సీబీఎన్



న్యూఢిల్లీ, ఆగస్టు 31:సైకోట్రోపిక్ ఔషధాల అక్రమ మళ్లింపు, అక్రమ రవాణాపై చేపట్టిన చర్యల్లో భాగంగా కేంద్ర నార్కోటిక్స్ బ్యూరో (సీబీఎన్) మధ్యప్రదేశ్ యూనిట్ కచ్చితమైన సమాచారం ఆధారంగా కీలక విజయం సాధించింది. పంజాబ్ - హిమాచల్‌ప్రదేశ్ మార్గంలో భారీగా సైకోట్రోపిక్ ఔషధాలను అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన కచ్చితమైన నిఘా సమాచారంతో, సీబీఎన్ మధ్యప్రదేశ్ యూనిట్‌కు చెందిన ప్రత్యేక నిరోధక బృందం నిరంతర నిఘా ఏర్పాటు చేసింది. ఆపరేషన్ వజ్ర 2.0 కింద 2026 ఆగస్టు 27 - 28 తేదీల్లో చండీగఢ్ - బద్దీ అంతర్ రాష్ట్ర మార్గంలో వ్యూహాత్మకంగా వాహారి ంచింది.

ఈ ఆపరేషన్‌లో భాగంగా పెద్ద ఎత్తున 66,79,980 సైకోట్రోపిక్ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఆల్ప్రజోలం, ట్రామాడోల్, నైట్రాజెపామ్, క్లోనాజెపామ్ మాత్రలు ఉన్నాయి. అవసరమైన చట్టబద్ధ పత్రాలు లేకుండానే ఈ ఔషధాలను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, ఒక ఎస్ఎంఎల్ ఇసుజు సర్తాజ్ ట్రక్కును స్వాధీనం చేసుకున్నారు.

రాత్రంతా నిఘా అనంతరం, 2026 ఆగస్టు 27న ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న అనుమానాస్పద ఎస్ఎంఎల్ ఇసుజు సర్తాజ్ ట్రక్కును బృందం అడ్డగించింది. అనంతరం క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు వాహనాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించింది.

ఒక్కో కార్టన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, నియంత్రిత సైకోట్రోపిక్ పదార్థాలతో కూడిన 120 మాస్టర్ కార్టన్లు బయటపడ్డాయి. ఈ సరుకులో ఆల్ప్రజోలం, ట్రామాడోల్, నైట్రాజెపామ్, క్లోనాజెపామ్ మాత్రలు ఉన్నాయి. మొత్తం 66,79,980 మాత్రలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ఈ అక్రమ సరఫరా శృంఖలాన్ని దాచడానికి, నిబంధనల నుంచి తప్పించుకోవడానికి పలు ఉద్దేశపూర్వక చర్యలు చేపట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్న బ్లిస్టర్ స్ట్రిప్స్, పెట్టెలపై బ్యాచ్ నంబర్లు, తయారీ తేదీలు, గడువు ముగిసే (ఎక్స్‌పైరీ) తేదీలను చెరిపివేసినట్లు గుర్తించారు.

"పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో విక్రయించరాదు" అనే ముద్రణ ఉన్న ఔషధాలను భారీ మొత్తంలో ఎలాంటి చెల్లుబాటు పత్రాలు లేకుండా ఈ ప్రాంతంలోకి తరలిస్తున్నట్లు గుర్తించారు. వీటికి సంబంధించి ఇన్‌వాయిస్‌లు, బిల్టీ లేదా ఈ-వే బిల్లులు వంటి అవసరమైన పత్రాలు ఏవీ లేవని తేలింది.

వివరమైన జాబితా తయారీ, పరిశీలన, స్వాధీనం ప్రక్రియలు రాత్రంతా 14 గంటలకు పైగా కొనసాగాయి. మొత్తం 66,79,980 సైకోట్రోపిక్ మాత్రలను, వాటిని తరలించేందుకు ఉపయోగించిన ఎస్ఎంఎల్ ఇసుజు సర్తాజ్ ట్రక్కును నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం - 1985లోని సంబంధిత నిబంధనల కింద స్వాధీనం చేసుకున్నారు. ఈ భారీ అంతర్రాష్ట్ర ఔషధాల అక్రమ మళ్లింపు వ్యవహారంలో ప్రమేయం ఉన్న ఔషధాల తయారీ, సరఫరాకు సంబంధించిన పైస్థాయి మార్గాలతో పాటు, దిగువస్థాయి పంపిణీ వ్యవస్థను గుర్తించి ఛేదించేందుకు తదుపరి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ సైకోట్రోపిక్ ఔషధాల అక్రమ మళ్లింపు, అక్రమ రవాణాతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తులు, సంస్థలను గుర్తించేందుకు కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

మందులు లేదా ఔషధాల సురక్షిత వినియోగం లక్ష్యంతో పాటు నషా ముక్త్ భారత్ అభియాన్ కు సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ (సీబీఎన్) దృఢంగా కట్టుబడి ఉంది. మత్తు పదార్థాలు, సైకోట్రోపిక్ ఔషధాల అక్రమ రవాణా, మళ్లింపులపై పక్కా సమాచారంతో కూడిన చట్టపరమైన చర్యలను నిరంతరం కొనసాగిస్తోంది.

ప్రస్తుత 2026 క్యాలెండర్ సంవత్సరంలో, కేంద్ర నార్కోటిక్స్ బ్యూరో (సీబీఎన్) అక్రమ రవాణా నిరోధక చర్యల్లో విశేష ప్రతిభ కనబరిచింది. అక్రమ మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌లతో సంబంధం ఉన్న 197 కేసులను నమోదు చేసి, 272 మందిని అరెస్ట్ చేసింది. సింథటిక్ మాదకద్రవ్యాల తయారీ కార్యకలాపాలపై కఠిన చర్యలు చేపట్టిన సీబీఎన్, 6 రహస్య మాదకద్రవ్యాల తయారీ ప్రయోగశాలలను ఛేదించింది. విస్తృతమైన కార్యాచరణ చర్యల ద్వారా భారీ మొత్తంలో అక్రమ మాదకద్రవ్యాల తరలింపును కూడా అడ్డుకుని సుమారు 51,000 కిలోల వివిధ రకాల ఎన్‌డీపీఎస్ మాదకద్రవ్యాలతో పాటు, 12,72,00,000 సైకోట్రోపిక్ ఔషధాల మాత్రలు, క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకుంది.

# ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఆదిలాబాద్, ఆగష్టు 31: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉట్నూర్ మండలం జెండాగూడకు చెందిన భగవంత్‌రావు పటేల్, చెరువుగూడకు చెందిన మారు పటేల్, మొర్రిపేటకు చెందిన మాణిక్‌రావు జలపాత్, దంతనపల్లి గ్రామపంచాయతీకి చెందిన సుభాష్‌తో పాటు పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీలో సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రైవేటు నర్సు శిరీష మృతిపై విచారణ జరపాలి

**జశిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం చేయాలి**
**అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని నాయకుల డిమాండ్**



ఆదిలాబాద్, ఆగష్టు 31:హైదరాబాద్ తుక్కుగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఉకే శిరీష అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంతరావు, తుడుం దెబ్బ సిర్పూర్(యు) మండల అధ్యక్షుడు కుమ్ర భీమ్రావు, గౌరవాధ్యక్షుడు పెందూర్ శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. శిరీష మృతి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి తగిన సహాయం అందించడంతో పాటు ఘటనకు బాధ్యులెవరైనా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తుడుం దెబ్బ మండల గౌరవాధ్యక్షుడు పెందూర్ శంకర్, మాజీ సర్పంచ్ అరక నాగోరావు, ఆత్రం దౌలత్‌రావు, తుడుం దెబ్బ, రాజ్‌గోండు సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.

# రెండు వారాల్లో సుమారు 150 కిలోల యాంఫెటమైన్ తరహా ఉత్ప్రేరక మాదకద్రవ్యాలను అడ్డుకున్న డీఆర్ఐ

న్యూఢిల్లీ, ఆగష్టు 31:సింథటిక్ డ్రగ్స్ అక్రమ రవాణాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా రెండు వేర్వేరు ఆపరేషన్లలో 2026 ఆగస్టు 25న బెంగళూరులో సుమారు 14.9 కిలోల యాంఫెటమైన్, పుణేలో సుమారు 2.53 కిలోల యాంఫెటమైన్‌తో పాటు 878 గ్రాముల ఎండీఎంఏ మాత్రలను స్వాధీనం చేసుకుంది. రెండు కేసుల్లో కలిపి 18 కిలోలకు పైగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోగా, నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం 1985 కింద నలుగురిని అరెస్టు చేశారు.

ఆగస్టు 25న అందిన నిఘా సమాచారంతో డీఆర్ఐ అధికారులు న్యూఢిల్లీ నుంచి బెంగళూరుకు రైలులో ప్రయాణిస్తున్న ఓ భారతీయ మహిళా ప్రయాణికురాలిని కేఎస్ఆర్ బెంగళూరు రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద భారీ మొత్తంలో అక్రమ మాదకద్రవ్యాలు ఉన్నట్లు అనుమానించారు.

ఆమె సామానును క్షుణ్ణంగా తనిఖీ చేయగా స్ఫటికాకార పదార్థంతో ఉన్న ఏడు ప్యాకెట్లు బయటపడ్డాయి. వాటి బరువు సుమారు 14.9 కిలోలు కాగా, ఫీల్డ్ డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో ప్రాథమిక పరీక్షల్లో అది యాంఫెటమైన్‌గా తేలింది. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలతో పాటు వాటిని ప్యాక్ చేసి దాచేందుకు ఉపయోగించిన సామగ్రిని ఎన్‌డీపీఎస్ చట్టం 1985 కింద స్వాధీనం చేసుకున్నారు. విచారణలో లభించిన సమాచారంతో డీఆర్ఐ అధికారులు నిర్దేశిత డెలివరీ ప్రదేశంలో తదుపరి చర్యలు చేపట్టారు. అక్కడ సామాను తీసుకు వస్తున్న వ్యక్తి నుంచి దానిని స్వీకరించేందుకు వచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మొదటి వ్యక్తి నుంచి మాదకద్రవ్యాలను స్వీకరించేందుకు వచ్చిన మరో వ్యక్తిని కూడా పట్టుకున్నారు. అక్రమ మాదకద్రవ్యాల రవాణా, వాటిని స్వీకరించేందుకు ప్రయత్నించిన ఈ ముగ్గురిని ఎన్‌డీపీఎస్ చట్టం 1985 నిబంధనల ప్రకారం అరెస్టు చేశారు.

ఆగస్టు 25న జరిగిన మరో నిఘా ఆధారిత ఆపరేషన్‌లో ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి పుణే మీదుగా ప్రయాణిస్తున్న మరో భారతీయ మహిళా ప్రయాణికురాలిని పుణే జంక్షన్ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె సామానును తనిఖీ చేయగా తెలుపు, పసుపు రంగులోని స్ఫటికాకార పదార్థం లభించింది. అది సుమారు 2.53 కిలోల యాంఫెటమైన్‌గా అనుమానిస్తున్నారు. అలాగే 3,4-మెథైలీన్ డయాక్సీమెథాంఫెటమైన్ (ఎండీఎంఏ) మాత్రలు సుమారు 878 గ్రాముల స్థూల బరువుతో లభించాయి. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను ఎన్‌డీపీఎస్ చట్టం కింద స్వాధీనం చేసుకొని, ఆ మహిళా ప్రయాణికురాలిని అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా సింథటిక్ డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడం, వాటి వెనుక ఉన్న రవాణా వ్యవస్థలను ఛేదించడంపై డీఆర్ఐ చేపడుతున్న ముమ్మర చర్యల్లో భాగంగా ఈ తాజా స్వాధీనాలు జరిగాయి. గత రెండు వారాల్లో అయిదు ఆపరేషన్లలో కలిపి సుమారు 150 కిలోల యాంఫెటమైన్ టైప్ స్టిమ్యులెంట్ (ఏటీఎస్) తరగతికి చెందిన మాదకద్రవ్యాలను డీఆర్ఐ స్వాధీనం చేసుకుంది. ఇందులో భారత ఈశాన్య సరిహద్దు ప్రాంతంలో జరిగిన రెండు ఆపరేషన్లలో 76 కిలోల మెథాంఫెటమైన్ మాత్రలు, అలాగే సౌదీ అరేబియాలోని జెడ్డాకు వెళ్లాల్సిన ఎగుమతి సరుకులో మొక్కజొన్నతో కలిపి దాచిన 55.86 కిలోల మెథాంఫెటమైన్ స్వాధీనం చేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి.

## అభివృద్ధి పనులకు ఎంపీ గోడం నగేశ్ శ్రీకారం

ఆదిలాబాద్, ఆగష్టు 31:ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేశ్ ఇచ్చోడ మండలం పట్వారిగూడ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో రూ.26 లక్షలతో మంజూరైన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం రూ.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సంతు సదన్ పీఠాధిపతి నారాయణ్ మహారాజ్, మాదాపూర్, బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్ టేహారే, నాయకులు సుభాష్ పాటిల్, హరన్, స్థానిక సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా, పెందుర్ కేశవ్, బాలాజీ దహాలే, కసల్ చంద్, మహమూద్, మురాద్, గ్రామ పటేల్, దేవారి, మహాజన్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లులను సాధికారులుగా తీర్చిదిద్దడం ద్వారా పిల్లల్లో వైకల్యాలను ముందుగానే గుర్తించవచ్చు: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 31:తల్లులకు సాధికారత కల్పించడం ద్వారా పిల్లల్లో వైకల్యాలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూ విజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), పీఎంఓ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

నివారించగల వైకల్యాల నివారణ, దివ్యాంగుల సాధికారతపై మహిళలకు అవగాహన కల్పించేందుకు సాక్షం సంస్థ నిర్వహించిన ప్రబుద్ధ "మాతృశక్తి సమ్మేళనం" కార్యక్రమాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. పిల్లల ఎదుగుదల, ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను చాలాసార్లు తల్లులే ముందుగా గుర్తిస్తారని, అందువల్ల దివ్యాంగ సేవ, సాధికారత అనే విస్తృత లక్ష్యంలో మహిళల్లో అవగాహనకు కీలక పాత్ర ఉందని ఆయన పేర్కొన్నారు. గర్భధారణ సమయంలో సరైన అవగాహనతో పాటు క్రమం తప్పకుండా పరీక్షలు, సిఫార్సు చేసిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కొన్ని రుగ్మతలను తొలిదశలోనే గుర్తించవచ్చని తెలిపారు. తద్వారా సకాలంలో వైద్య సలహా, చికిత్స అందించి నివారించగల ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.

విద్యావంతులు, అవగాహన కలిగిన, సామాజిక బాధ్యత కలిగిన మహిళలను దివ్యాంగ సేవ, సాధికారత, నివారించగల వైకల్యాల నివారణ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వాములుగా చేయడం 'ప్రబుద్ధ మాతృశక్తి సమ్మేళనం' ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పిల్లలు, కుటుంబాల ఆరోగ్యం, అభివృద్ధి, సంక్షేమంతో సన్నిహిత సంబంధం ఉన్న తల్లులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, సమాజ నాయకుల పాత్రకు ఈ కార్యక్రమం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. నివారించగల వైకల్యాలను అరికట్టే ప్రయత్నాలు సాధ్యమైనంత తొందరగా, శిశువు జన్మించకముందే ప్రారంభం కావాలని అన్నారు. తల్లి ఆరోగ్యం, తగిన పోషకాహారం, గర్భధారణకు ముందు తర్వాత వైద్య సంరక్షణ, ఇన్ఫెక్షన్ల నివారణ, మందులను సురక్షితంగా వినియోగించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, వైద్య నిపుణులను సకాలంలో సంప్రదించడం వంటి అంశాలపై అవగాహన ఉంటే గర్భధారణ, చిన్ననాటి కీలక దశల్లో కుటుంబాలు సరైన నిర్ణయాలు తీసుకోవచ్చని తెలిపారు. గర్భధారణ సమయంలోనే ఏదైనా సమస్యను గుర్తించే అవకాశం ఉంటే, సకాలంలో వైద్యం, తగిన సంరక్షణ ద్వారా ఫలితాలను గణనీయంగా మెరుగుపరచవచ్చని అన్నారు.

తన గత 12 సంవత్సరాల అనుభవం కూడా అవగాహన, సహాయక వ్యవస్థలను కుటుంబాలు, సమాజ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇందులో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంలో వచ్చే మార్పులను చాలాసార్లు తల్లులే మొదటగా గుర్తిస్తారని, అందువల్ల వారికి సరైన అవగాహన, జ్ఞానం కల్పించడం ద్వారా వైకల్యాలను ముందుగానే గుర్తించడం, తగిన వైద్య సేవలకు సిఫార్సు చేయడం, అందుబాటులో ఉన్న సహాయాన్ని సకాలంలో పొందడం సాధ్యమవుతుందని తెలిపారు.

అయితే అవగాహన కేవలం నివారణకే పరిమితం కాకుండా దివ్యాంగుల సంపూర్ణ సాధికారత వరకూ విస్తరించాలని కేంద్ర మంత్రి అన్నారు. పిల్లలు, దివ్యాంగులు సకాలంలో వైకల్య గుర్తింపు, విద్య, పునరావాసం, సహాయక పరికరాలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, స్వావలంబనకు అవసరమైన అవకాశాలను పొందేలా చూడటం ద్వారా మహిళలు దివ్యాంగుల సాధికారతకు బలమైన మార్గదర్శకులుగా నిలవగలరని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

ఈ విస్తృత ప్రయత్నంలో భాగంగా, దివ్యాంగులకు మద్దతును బలోపేతం చేయడంతో పాటు సమాజంలో వారి భాగస్వామ్యానికి మరిన్ని అవకాశాలను కల్పించేందుకు గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. కుటుంబాలు, సమాజ స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న మాతృశక్తి సమ్మేళనం వంటి కార్యక్రమాలకు ఈ ప్రయత్నాలు తోడ్పడుతున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

దివ్యాంగుల కోసం క్రీడలు, ప్రత్యేక మౌలిక వసతుల విస్తరణను కూడా డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. దివ్యాంగుల కోసం దేశంలో తొలి అత్యాధునిక క్రీడా శిక్షణ కేంద్రాన్ని మధ్యప్రదేశ్‌లో ప్రారంభించారు. ఇందులో అత్యున్నత స్థాయి శిక్షణ, క్రమబద్ధమైన క్రీడా శిక్షణకు అవసరమైన సహకారం అందిస్తున్నారు. ఇటువంటి ప్రత్యేక మౌలిక వసతులు క్రీడల్లో ప్రతిభను చాటుకునేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పారిస్ 2024 పారాఒలింపిక్ క్రీడల్లో భారత్ రికార్డు స్థాయిలో 29 పతకాలు సాధించడంలో కూడా దోహదపడ్డాయని తెలిపారు.

దివ్యాంగులైన పిల్లలకు ముందస్తు వైద్య సేవలను కూడా ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. శిశు దశ నుంచే దివ్యాంగ పిల్లలను గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందించేందుకు దేశవ్యాప్తంగా వివిధ రకాల వైకల్యాలకు సంబంధించిన ప్రారంభ చికిత్సా కేంద్రాలను (క్రాస్-డిసబిలిటీ ఎర్లీ ట్రీట్‌మెంట్ సెంటర్లు) ఏర్పాటు చేస్తున్నారు. చిన్న వయసులోనే వైకల్యాన్ని గుర్తించి, తగిన చికిత్స, పునరావాసం, సహకారం అందించడం ద్వారా పిల్లలు తమ అభివృద్ధి సామర్థ్యాన్ని పూర్తిగా సాధించడంతో పాటు విద్య, సమాజంలో మరింత చురుగ్గా పాల్గొనే అవకాశం ఉంటుంది.

దివ్యాంగ పిల్లలు కలిగిన ప్రభుత్వ ఉద్యోగుల కోసం అందుబాటులో ఉన్న పలు ప్రత్యేక సదుపాయాలను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. పిల్లల ప్రత్యేక అవసరాలను తీర్చుకునే కుటుంబాలకు మరింత మద్దతు అందించేందుకు ఈ సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోటేషనల్ బదిలీ నుంచి మినహాయింపు, 22 ఏళ్ల వయస్సు వరకు పిల్లల విద్యా భత్యం, వైద్య సదుపాయాలకు సమీప ప్రాంతాల్లో పోస్టింగ్‌కు అవకాశం, రెండేళ్ల వేతనంతో కూడిన శిశు సంరక్షణ సెలవులు వంటి ప్రయోజనాలు ఇందులో ఉన్నాయి.

# మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియంలో కేంద్ర క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ నేతృత్వంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



న్యూఢిల్లీ, ఆగష్టు 31:దిగ్గజ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ 121వ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నేడు జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత క్రీడా రంగానికి ఆయన అందించిన సేవలు నేటికీ క్రీడాకారులకు, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.

న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఉన్న మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియంలో ప్రత్యేక క్రీడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, కేంద్ర న్యాయ, న్యాయశాఖ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ ఏడాది వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన 'ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మే' కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. దేశ పౌరులు ముఖ్యంగా యువత కనీసం ఒక గంట క్రీడలు, శారీరక వ్యాయామానికి కేటాయించేలా ఈ కార్యక్రమం ద్వారా ప్రోత్సహించారు.

కేంద్రమంత్రులు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన అనంతరం కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం 8 గంటల నుంచి వందలాది మంది పాల్గొని వివిధ క్రీడా, ఫిట్‌నెస్ కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ.. ఫిట్ ఇండియా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలు క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మే' కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

"మేజర్ ధ్యాన్‌చంద్ 121వ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా ఫిట్ ఇండియా ఉద్యమాన్ని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా 'ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం" అని ఆయన అన్నారు.

"దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత ప్రతి వీధిలో, ప్రతి క్రీడా మైదానంలో ఒక గంటపాటు ఆటలాడేందుకు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రధానమంత్రి శ్రీ మోదీ నాయకత్వంలో దేశం మారుతోంది. ముందుకు సాగుతోంది. కొత్త భారత్ నిర్మితమవుతోంది అని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను" అని డాక్టర్ మాండవీయ అన్నారు.

"ప్రధాని శ్రీ మోదీ కలలుగన్న కొత్త భారత్‌ను నిర్మించే క్రమంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, దృఢంగా ఉండే సమాజాన్ని కూడా మనం నిర్మించాలి. అదే మన దేశాన్ని సుసంపన్న దేశంగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుంది. అందరం ప్రతి వారం ఒక గంటను క్రీడా మైదానంలో గడుపుతూ మన ఆరోగ్యంపై శ్రద్ధ వహిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు కేంద్ర న్యాయశాఖ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్ శుభాకాంక్షలు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో క్రమం తప్పకుండా క్రీడలు ఆడటం, శారీరక వ్యాయామం చేయడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

ఆయన మాట్లాడుతూ.. "కబడ్డీ, ఫుట్‌బాల్ నుంచి దాదాపు ప్రతిరోజూ బ్యాడ్మింటన్ ఆడటం వరకు క్రీడలు ఎప్పుడూ నా జీవితంలో భాగంగానే ఉన్నాయి. 'ఉదయం సంగీతం.. సాయంత్రం ఆట' అనేది నా వ్యక్తిగత నినాదం. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండవచ్చు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఒక గంట క్రీడలకు కేటాయించాలన్న ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పిలుపు దేశానికి ఎంతో కీలకమైనది. ఇది 'హమ్ ఫిట్ తో ఇండియా ఫిట్' కార్యక్రమానికి మద్దతునివ్వడంతో పాటు వికసిత్ భారత్ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది" అని శ్రీ మేఘ్వాల్ అన్నారు.

క్రీడల్లో భాగస్వామ్యాన్ని, బృంద స్ఫూర్తిని, చురుకైన జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు క్రికెట్, ఫుట్‌బాల్, తాడు లాగడం వంటి పలు క్రీడా కార్యక్రమాలను నిర్వహించారు.

క్రికెట్ పోటీలో మంత్రిత్వ శాఖ ఎక్స్ఐ, ఎస్ఏఐ ఎక్స్ఐ, మీడియా ఎక్స్ఐ, ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఎక్స్ఐ అనే నాలుగు జట్లు పాల్గొన్నాయి.

డాక్టర్ మన్సుఖ్ మాండవీయ నాయకత్వంలోని మంత్రిత్వ శాఖ ఎక్స్ఐ జట్టులో క్రీడల శాఖ కార్యదర్శి శ్రీ హరి రంజన్ రావుతో పాటు మంత్రిత్వ శాఖ అధికారులు సభ్యులుగా ఉన్నారు. ప్రారంభ క్రికెట్ మ్యాచ్‌లో మీడియా ఎక్స్ఐపై మంత్రిత్వ శాఖ ఎక్స్ఐ ఘన విజయం సాధించింది. ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఎక్స్ఐ జట్టులో ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఫిట్ ఇండియా అంబాసిడర్లు పాల్గొన్నారు.మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు దేశవ్యాప్తంగా క్రీడలు, ఫిట్‌నెస్, చురుకైన జీవన విధానాన్ని ప్రోత్సహించాలన్న ప్రభుత్వ నిబద్ధతను మరోసారి చాటిచెప్పాయి. అదే సమయంలో భారత క్రీడా రంగంలో మేజర్ ధ్యాన్‌చంద్ అందించిన చిరస్మరణీయ సేవలకు ఘన నివాళిగా ఈ వేడుకలు నిలిచాయి.

# 22ఏలో పొరపాట్లకు తావివ్వొద్దు!

కరీంనగర్, ఆగష్టు 31:22ఏ నిషేధిత భూముల జాబితాలో భూముల చేర్పు, తొలగింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పూర్తి ఆధారాలు, భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. నిజమైన ప్రైవేటు భూములు పొరపాటున 22ఏ జాబితాలో నమోదైతే వాటికి సంబంధించిన సమస్యలను 48 గంటల్లో పరిష్కరించాలని స్పష్టం చేశారు.

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూ రికార్డుల పరిశీలన, 22ఏ జాబితాలో భూముల చేర్పు, తొలగింపు తదితర అంశాలపై సమీక్షించారు.



ప్రైవేటు భూమి పొరపాటున 22ఏ జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే సర్వే నంబర్ వారీగా తొలగింపు జాబితా రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. భూములను 22ఏ జాబితాలో చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ పాటించాలని సూచించారు.

జాబితా నుంచి తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు నిర్దిష్ట కారణాలతో పాటు స్పష్టమైన రిమార్కులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 22ఏ భూముల పరిశీలన, జాబితా నుంచి తొలగింపు ప్రక్రియకు ఒకే విధమైన ఫార్మాట్ రూపొందించాలని సూచించారు. ప్రతి భూమికి సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

22ఏ జాబితాలో చేర్చే ప్రతి భూమికి స్పష్టమైన ఆధారాలు ఉండాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడొద్దని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే తుది నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ '420' పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం

**సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు నిరసనలు**

**హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందంటూ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శలు**

కరీంనగర్, ఆగష్టు 31: తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం '420 పాలన' కొనసాగిస్తోందని బీఆర్ఎస్ పెద్దపెల్లి



జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 420 హామీలను నెరవేరుస్తామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, అయితే వెయ్యి రోజులు గడుస్తున్నా హామీలు అమలు కాలేదని విమర్శించారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతో తెలంగాణ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని, నమ్ముకున్న ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గని కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వంతో ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గానికి అన్యాయం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్‌హరి మాట్లాడుతూ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల ప్రయోజనాలను ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు.

సెప్టెంబర్ 2 నుంచి 'సమరశంఖం' కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి రామగుండం నియోజకవర్గంలో 'సమరశంఖం' పేరుతో వారం రోజులపాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి నిరసన ప్రదర్శన చేపడతామని చెప్పారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను బహిర్గతం చేస్తామని పేర్కొన్నారు. కార్మికులు, ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

## ఉజ్బెకిస్తాన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక పర్యటన సందర్భంగా సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, ఆగష్టు 31 :పునరుత్పాదక ఇంధనం, ఇంధన మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, భవిష్యత్ పెట్టుబడి ప్రాజెక్టుల అమలులో సహకార విస్తృతిపై చర్చలకు నాయకుల హర్షామోదాలు.

భూగర్భ శాస్త్రం-గనుల తవ్వకం, అణుశక్తి, పారిశ్రామిక సహకారం, కీలక-వ్యూహాత్మక ఖనిజ రంగాల్లో సహకారం దిశగా అంగీకారం. ఖనిజ వనరుల శుద్ధి, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, రీసైక్లింగ్ కార్యక్రమాల సంబంధిత ప్రాజెక్టు లు కూడా అంతర్భాగంగా ఉంటాయి. ఉజ్బెకిస్తాన్‌లో ఖనిజ నిక్షేపాల రంగం భవిష్యత్ అభివృద్ధిలో పాలుపంచుకునేలా భారతీయ కంపెనీలను, భారత్ లో ఉమ్మడి సహకారం కోసం ఉజ్బెక్ సంస్థలను ప్రోత్సహించడంపై అధినేతల ఆసక్తి వ్యక్తీకరణ. శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తి వినియోగంపై సహకార విస్తృతికి సుముఖత.

భూగర్భ అన్వేషణ, గనుల తవ్వకం, ఖనిజ శుద్ధి, సమీకృత విలువ వ్యవస్థల ప్రగతిలో ఉమ్మడి ప్రాజెక్టుల అమలు ద్వారా కీలక ఖనిజాల రంగ సహకార విస్తరణకు అంగీకారం.

వ్యవసాయ రంగం

వ్యవసాయ విలువ వ్యవస్థల అభివృద్ధి, ఎగుమతి సామర్థ్యాల బలోపేతం సహా వ్యవసాయ, పశుసంపద రంగాల సాంకేతిక సామర్థ్యం పెంపులో సహకారానికీ అంగీకారం.

వ్యవసాయం-ఆహార భద్రత రంగాలలో సహకార బలోపేతంపై నాయకులిద్దరూ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఆవిష్కరణలు-వనరుల సమర్థ వినియోగం సాంకేతికతలపై వారు ప్రధానంగా దృష్టి సారించారు. వ్యవసాయ శాస్త్ర విజ్ఞానంలో ఆదానప్రదానం కొనసాగింపు, ఈ ప్రాంతమంతటా ఆధునిక-సుస్థిర వ్యవసాయాభివృద్ధికి ప్రోత్సాహం దిశగా బహుళపక్ష, ప్రాంతీయ వేదికల సమర్థ వినియోగానికి అంగీకారం. వ్యవసాయ ఉత్పత్తులలో ద్వైపాక్షిక వాణిజ్య సౌలభ్య కల్పనకు ఆమోదం.

వ్యవసాయ ఉత్పాదకత పెంపు, మొక్కల జన్యు వనరుల పరిరక్షణ-సుస్థిర వినియోగంలో పరిశోధన సంస్థలు-పరిశ్రమల మధ్య సహకార విస్తరణకు మద్దతుపై అంగీకారం.

### రవాణా.. సదుపాయాలు.. అనుసంధానం

బహుళ రవాణా సదుపాయాల వినియోగ మార్గాలు, లాజిస్టిక్స్ కారిడార్ల అభివృద్ధితో భారత్-ఉజ్బెకిస్తాన్ మధ్య రవాణా-లాజిస్టిక్స్ అనుసంధానం మెరుగుదల సహా వస్తూత్పత్తుల నిరంతరాయ రవాణానుకూల పరిస్థితుల సృష్టిపై ఉమ్మడి కృషి కొనసాగింపుపై నిబద్ధత పునరుద్ఘాటన.

రవాణా వ్యయం తగ్గింపు ద్వారా సరుకు రవాణా పునరుద్ధరణ లక్ష్యంతో సహకారం కొనసాగింగిపై నాయకులు సన్నద్ధత.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ద్వారా రహదారుల నిర్మాణంలో నైపుణ్య పరస్పర ఆదానప్రదానంతో సంబంధిత అధికారుల మధ్య సహకార విస్తరణకు ఆమోదం. అలాగే, రహదారి మౌలిక సదుపాయాల పునర్నిర్మాణం-ఆధునికీకరణణపై ఉమ్మడి ప్రాజెక్టుల అమలు అవకాశాల అన్వేషణపై సుముఖత వ్యక్తీకరణ.

ఉజ్బెకిస్తాన్ ప్రభుత్వ రవాణా రంగానికి పర్యావరణ హిత, ఇంధన పొదుపు పరిష్కారాల రూపకల్పన ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ- ఈ రంగంలో ఉమ్మడి ప్రాజెక్టుల అమలు అవకాశాలపై అన్వేషణకు అంగీకారం.

### డిజిటల్ సాంకేతికతలు - ఆవిష్కరణలు - అంతరిక్ష సహకారం

భారతీయ నమూనా ప్రాతిపదికన సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా మద్దతుతో 2019లో తాష్కెంట్‌లో ఏర్పాటైన తొలి ఐటీ పార్క్ విజయవంతం కావడంపై నాయకులిద్దరి హర్షం. అలాగే, రెండు దేశాల సాంకేతిక పార్కులు, కంపెనీలు, అంకుర సంస్థలు, విద్యా సంస్థల మధ్య భాగస్వామ్యాల విస్తరణకు అంగీకారం.

ఉన్నత సాంకేతికతలు, డిజిటల్ రూపాంతరీకరణ రంగాల్లో ద్వైపాక్షిక సహకార బలోపేతం సహా న్యూఢిల్లీలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' 2026 ఫిబ్రవరి నాటి అవగాహన ఒప్పందాల అమలుపై నాయకుల హర్షం.

సుస్థిర ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణాధారిత అభివృద్ధి, సామాజిక సవాళ్ల సమర్థ పరిష్కారాలను ప్రోత్సహించడంపై ఏఐ సామర్థ్య వినియోగించడంపై దృష్టి. ఈ మేరకు అనుభవాలు, ఉత్తమ పద్ధతుల ఆదానప్రదానం సహా సురక్షిత, భద్రమైన, విశ్వసనీయ ఏఐ వ్యవస్థల రూపకల్పన, పురోగమనంలో సహకార బలోపేతానికి నాయకుల అంగీకారం.

అంతరిక్ష అనువర్తనాలు, శాస్త్రీయ సమాచార ఆదానప్రదానం ఉమ్మడి వర్క్‌షాపుల నిర్వహణ-శిక్షణ ద్వారా సామర్థ్య వికాసం వంటి అంశాలు సహా బాహ్య అంతరిక్ష అన్వేషణ, శాంతియుత వినియోగాల్లో ఆచరణాత్మక సహకార విస్తరణపై నాయకుల సన్నద్ధత పునరుద్ఘాటన.

విద్య.. మానవ వనరుల అభివృద్ధి.. ఆరోగ్యం.. సంస్కృతి.. క్రీడలు.. పర్యాటకం

ఉజ్బెకిస్తాన్-భారత్ ప్రజల మధ్య దీర్ఘకాలిక సంబంధాల బలోపేతం దిశగా భారత విద్యార్థుల అమూల్య కృషికి నాయకుల ప్రశంసలు.

ఉజ్బెకిస్తాన్‌లో భారతీయ అధ్యయనాల నిరంతర విస్తరణపై హర్షం.. భారత్‌లో ఉజ్బెక్ అధ్యయనాల విస్తరణకు మద్దతు ప్రకటన.

ఉజ్బెకిస్తాన్-భారత్ మధ్య కీలక వారధి అయిన మానవ వనరుల అభివృద్ధిలో సహకార బలోపేతంపై ఏకాభిప్రాయం. ఈ మేరకు ఉమ్మడి పరిశోధన, విద్యా సహకార కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యం.సామర్థ్య వికాసం, మానవ వనరుల అభివృద్ధిలో.. ముఖ్యంగా- వైద్యం, ఔషధాలు, రసాయన శాస్త్రం, నానోటెక్నాలజీ, బయోటెక్నాలజీ రంగాల్లో దీర్ఘకాలిక-పరస్పర ప్రయోజనకర భాగస్వామ్యంపై నాయకుల ప్రశంసలు. కొన్నేళ్లుగా 2,700 మందికి పైగా ఉజ్బెక్ దేశీయులు ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అలాగే, ఆయుష్ స్కాలర్‌షిప్‌లు 'ఐసీసీఆర్' ఉపకారవేతనాల కింద 400 మందికి పైగా ఉజ్బెక్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో, ఉజ్బెకిస్తాన్‌లో హిందీ భాషాభివృద్ధి కోసం లాల్ బహదూర్ శాస్త్రి స్కాలర్‌షిప్‌ను భారత్ ప్రకటించడంపై ఉజ్బెక్ పక్షం హర్షం ప్రకటించింది. 'ఐటెక్' కార్యక్రమం కింద మానవ వనరుల అభివృద్ధిలో సహకారాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు నాయకులిద్దరూ సంసిద్ధతను పునరుద్ఘాటించారు.

ఉజ్బెకిస్తాన్ "యశీల్ మాకోన్" భారత్ "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమాల ఏకరూపత తరహాలో భావితరాలకు ఆరోగ్యకర, హరిత భూగోళాన్ని సంక్రమింపజేసే ఆకాంక్షను నాయకులిద్దరూ సంయుక్తంగా వెల్లడించారు. ఈ ఉమ్మడి నిబద్ధత ప్రాతిపదికన అరల్ సముద్ర ప్రాంతంలో పచ్చదనం విస్తరణ సహా పర్యావరణ పునరుద్ధరణకు రెండు దేశాలూ సహకరించుకుంటాయి. ఇందుకు అవసరమైన సాంకేతిక మద్దతుతో సహా 1 మిలియన్ డాలర్ల విలువైన పనులను భారత్ ఆర్థిక సహాయంతో చేపడతారు.

ఆధునిక శాస్త్రీయ పరిశోధనల ద్వారా కొత్త చికిత్స విధానాలు, పద్ధతుల అభివృద్ధి కోసం పరస్పరం సామర్థ్య వినియోగానికి సుముఖత వ్యక్తం చేశారు. తద్వారా బయోమెడికల్ పరిశోధన-వైద్య ఆవిష్కరణ రంగాలు సహా ప్రజారోగ్య వ్యవస్థల బలోపేతంలో సహకార విస్తరణకు రెండు దేశాల నాయకులు అంగీకరించారు.

ఔషధ రంగంలో సహకార విస్తరణను వారిద్దరూ ఎంతగానో ప్రశంసించారు. అలాగే, ఉమ్మడి ప్రాజెక్టుల అమలు, ఆధునిక ఔషధ తయారీలో పెట్టుబడుల ఆకర్షణ, ఉత్పత్తి స్థానికీకరణ, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ సౌలభ్యం, అత్యంత నిపుణ శ్రామిక శక్తికి రూపకల్పన తదితరాల కోసం 'తాష్కెంట్ ఫార్మా పార్క్ ఇన్నోవేటివ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ ఫార్మాస్యూటికల్ క్లస్టర్' గణనీయ సామర్థ్యంగల సమర్థ వేదికగా ఉపయోగపడుతుందని వారిద్దరూ ఏకాభిప్రాయం వెలిబుచ్చారు.

### శాస్త్రి స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించిన ప్రధానమంత్రి అనంతరం తాష్కెంట్ స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్ సందర్శన

న్యూఢిల్లీ, ఆగష్టు 31: తాష్కెంట్‌లోని స్వర్గీయ శాస్త్రి స్మారక చిహ్నం వద్ద ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పుష్పాంజలి ఘటించారు. భారత మాజీ ప్రధాని స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి 1965లో తాష్కెంట్‌లో మరణించి ఈ ఏడాదితో 60 ఏళ్లు పూర్తవుతున్నాయి. స్వర్గీయ శాస్త్రి స్మారకార్థం ఆయన పేరుతో గల ఒక వీధిలో ఈ స్మారక చిహ్నం ఏర్పాటు చేశారు. తాష్కెంట్‌లో మాజీ ప్రధానమంత్రి జీవితాన్ని, వారసత్వాన్ని ఎంతో ఆప్యాయంగా స్మరించుకుంటారు. తాష్కెంట్‌లో ఈ స్మారక చిహ్నం గల వీధితో పాటుగా ఆయన పేరు మీద ఒక స్థానిక పాఠశాల, భారతీయ సాంస్కృతిక కేంద్రం ఉన్నాయి.

శాస్త్రి స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించిన ప్రధానమంత్రి, అనంతరం తాష్కెంట్ స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌ను సందర్శించారు. విశ్వవిద్యాలయంలో ప్రధానమంత్రి శ్రీ మోదీకి ఉజ్బెకిస్తాన్ ప్రధానమంత్రి, విశ్వవిద్యాలయ రెక్టార్ ఆత్మీయ స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయంలోని మహాత్మాగాంధీ కేంద్రంలో భారతీయ విద్యావేత్తలు, అక్కడ చదువుతున్న విద్యార్థులతో ప్రధానమంత్రి సంభాషించారు. హిందీ భాష, ఇతర భారతీయ విషయాలను బోధించడంలో ఈ విశ్వవిద్యాలయానికి అద్భుతమైన రికార్డు ఉంది. తన అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి... హిందీ భాష చదివే ఉజ్బెక్ విద్యార్థుల కోసం లాల్ బహదూర్ శాస్త్రి స్కాలర్‌షిప్‌ను ప్రకటించారు. ఈ సంవత్సరంతో ఈ విశ్వవిద్యాలయంలో హిందీ బోధనకు 80 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సాంస్కృతిక సారూప్యతల దృష్ట్యా... ఉజ్బెక్ విద్యార్థుల్లో హిందీ నేర్చుకోవడం పట్ల గణనీయమైన ఆసక్తి ఉంది. ఉజ్బెక్, హిందీ భాషల్లో సుమారు 3000కు పైగా ఉమ్మడి పదాలు ఉన్నాయి.

# కాంగ్రెస్ పాలనపై రామగుండంలో బీజేపీ సమరభేరి

**నాలుగు రోజుల పాటు నిరసనలు..**

**ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తాం**



కరీంనగర్, ఆగష్టు 31:తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న పాలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రామగుండం నియోజకవర్గంలో బీజేపీ సోమవారం సమరభేరి కార్యక్రమాన్ని ప్రారంభించింది. గోదావరిఖని పట్టణంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ మూడేళ్ల పాలనలో ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందలేదని విమర్శించారు.

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ప్రజలను నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. రామగుండం అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉందని తెలిపారు. నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, హామీల అమలుపై ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. అమృత్ నిధుల కింద రామగుండానికి వందల కోట్ల రూపాయలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉందని సోమారపు లావణ్య స్పష్టం చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీ మాట్లాడుతూ రామగుండంలో అభివృద్ధి పేరుతో కూల్చివేతలు మాత్రమే జరుగుతున్నాయని ఆరోపించారు. అభివృద్ధి చేయడం చేతకాక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు మామిడి రాజేష్, మాతంగి రేణుక, నరహరి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతిని కలిసిన గండుగులపల్లి విద్యార్థిని లహరి..

**రాష్ట్రపతి భవన్‌లో రాఖీ వేడుకల్లో పాల్గొన్న 9వ తరగతి విద్యార్థిని లహరిని అభినందించిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**



ఖమ్మం, ఆగష్టు 31: దమ్మపేట మండలం గండుగులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి. లహరి అరుదైన అవకాశాన్ని అందుకుంది. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన రాఖీ పౌర్ణమి ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకుని ఆమెతో సంభాషించింది. దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థుల్లో లహరి చోటు దక్కించుకోవడం గండుగులపల్లి పాఠశాలకే కాకుండా మొత్తం ప్రాంతానికి గర్వకారణంగా మారింది.

రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక రక్షాబంధన్ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విద్యార్థులతో ముచ్చటించారు. రక్షాబంధన్ పండుగలోని ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, బాధ్యత వంటి విలువల ప్రాముఖ్యతను వారికి వివరించారు. సమాజంలో సామరస్యం, మానవత్వాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.

ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై కూడా రాష్ట్రపతి ప్రత్యేకంగా మాట్లాడారు. చెట్లు, ప్రకృతి పట్ల బాధ్యతాభావాన్ని పెంపొందించుకోవాలని, వాటిని ప్రేమతో సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణపై తమ నిబద్ధతను తెలియజేసేలా చెట్లకు కూడా రాఖీలు కట్టాలని ప్రోత్సహించారు. రాష్ట్రపతి భవన్‌లో దేశ ప్రథమ పౌరురాలిని నేరుగా కలుసుకుని ఆమెతో మాట్లాడడం లహరికి జీవితంలో మరపురాని అనుభవంగా నిలిచింది.

గండుగులపల్లి ఏకలవ్య పాఠశాల విద్యార్థిని లహరి రాష్ట్రపతిని కలుసుకోవడంపై తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభినందించారు. జాతీయ స్థాయిలో ఎంపికై రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. లహరి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంజయ్ మలాకర్ ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి అవకాశాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా పెద్ద కలలు కనాలనే స్ఫూర్తిని కలిగిస్తాయని తెలిపారు. దేశానికి సేవ చేయాలనే భావనను విద్యార్థుల్లో పెంపొందించడంలో ఇటువంటి జాతీయ స్థాయి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

కాగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్వగ్రామం కూడా గండుగులపల్లి కావడం విశేషం. అదే గ్రామానికి చెందిన ఏకలవ్య పాఠశాల విద్యార్థిని లహరి రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి దేశ రాష్ట్రపతిని కలుసుకోవడం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. లహరి సాధించిన ఈ అరుదైన అవకాశం పాఠశాల చరిత్రలో ఒక చిరస్మరణీయ మైలురాయిగా నిలిచింది.

# అలంకార మత్స్య పరిశ్రమ కోసం "మిషన్ రంగీన్ మఛ్లీ-2031" వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరించనున్న ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగష్టు 31:కేంద్ర మత్స్య-పాడి-పశుసంవర్ధక మంత్రిత్వశాఖ పరిధిలోని మత్స్య విభాగం ఈ నెల 31న (సోమవారం) లక్షద్వీప్‌లోని అగట్టిలో ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఇందులో భాగంగా అలంకార మత్స్య పరిశ్రమ ప్రగతికి ఉద్దేశించిన "మిషన్ రంగీన్ మఛ్లీ-2031" పేరిట వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను గౌరవనీయ ఉపరాష్ట్రపతి ఆవిష్కరిస్తారు.

కేంద్ర మత్స్య-పాడి-పశు సంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, సహాయమంత్రి ప్రొఫెసర్ శ్రీ ఎస్.పి.సింగ్ బఘేల్ సహా లక్షద్వీప్ పాలన యంత్రాంగాధిపతి శ్రీ ప్రఫుల్ ఖోడే పటేల్ ఈ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. అలాగే, మత్స్యశాఖతోపాటు లక్షద్వీప్ అధికారులు, మత్స్య సముదాయాలు, సంబంధిత ఇతర మంత్రిత్వ శాఖలు-విభాగాల ప్రతినిధులు సహా మహిళా మత్స్య రైతులు, మత్స్యకారులు, 'ఎస్ఎస్ఎస్ఎస్' చేపల రైతులు కూడా ఇందులో పాలుపంచుకుంటారు.

భారత్‌కు అపార సముద్ర సంపద ఉన్నప్పటికీ, ఇంతటి విస్తృత వనరుల వినియోగం మాత్రం గణనీయంగా చాలా తక్కువ. మొత్తం 11,099 కిలోమీటర్ల తీరప్రాంతం, 2.2 మిలియన్ చదరపు కిలోమీటర్ల ప్రత్యేక ఆర్థిక మండలం (ఈఈజడ్), అంచనాల మేరకు 5.31 మిలియన్ టన్నుల సముద్ర మత్స్య సంపద తదితరాలు భారత్ సొంతం. అందువల్ల సుస్థిర మత్స్య పరిశ్రమ, సముద్రపు లోతుల్లో చేపల వేట, సముద్ర జీవసాగు, నీలి ఆర్థిక వ్యవస్థ పురోగమనం తదితరాలపరంగా మన దేశానికిగల అవకాశాలు అపారం. దాదాపు 4 లక్షల చదరపు కిలోమీటర్ల 'ఈఈజడ్' (జాతీయ విస్తీర్ణంలో సుమారు 17%), 4,200 చదరపు కిలోమీటర్లకు పైగా లోతు తక్కువ మడుగులు గల లక్షద్వీప్ ప్రాంతం వినియోగంలోకి రాని కొత్త సామర్థ్యానికి ఒక ఉదాహరణ. ఈ సువిశాల, సుస్థిర వనరుల సమృద్ధిగల సముద్ర జీవావరణ వ్యవస్థ, అధిక విలువగల మత్స్య వనరుల సద్వినియోగం సహా సముద్ర జీవసాగు విస్తరణ, తీరప్రాంత జీవనోపాధి కల్పన, సుస్థిర నీలి ఆర్థిక వ్యవస్థ వృద్ధిని వేగిరపరచడం తదితరాల్లో గణనీయ అవకాశాలున్నాయి.

మత్స్య రంగంలో సమీకృత, విలువ శ్రేణి ఆధారిత వృద్ధి సాధన దిశగా కేంద్ర ప్రభుత్వం సముదాయ ప్రాతిపదిక విధానాన్ని అనుసరిస్తోంది. ఈ వ్యూహానికి అనుగుణంగా సాగు, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెట్ అనుసంధానానికి ప్రోత్సాహం తదితరాలకు వీలుగా లక్షద్వీప్‌ను ప్రత్యేక సీవీడ్ క్లస్టర్‌గా ప్రకటించింది. ఈ దీవులలో సముద్ర అలంకార మత్స్య సంపద సమృద్ధిగా ఉంది. ఇవి సముద్ర జీవావరణ వ్యవస్థలను పరిరక్షిస్తూ సుస్థిర పెంపకం, ఎగుమతులు, జీవనోపాధి కల్పనలోనూ గణనీయ అవకాశాలను కల్పిస్తాయి.

ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు మత్స్య రంగం లబ్ధిదారులకు గౌరవనీయ ఉపరాష్ట్రపతి వివిధ ప్రయోజనాలను పంపిణీ చేస్తారు. ముఖ్యంగా అలంకార మత్స్య పరిశ్రమ ప్రగతికి ఉద్దేశించిన "మిషన్ రంగీన్ మఛ్లీ-2031" వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరిస్తారు. అలంకార మత్స్య సంపద విలువ వ్యవస్థలో శాస్త్రీయ నిర్వహణ, జీవభద్రత, నాణ్యతకు హామీ సహా నియంత్రణ-సమ్మతి దిశగా ఏకరూప చట్రాన్ని ఈ ప్రణాళిక సమకూరుస్తుంది. దీనికింద ప్రామాణిక కార్యాచరణ విధానాలతోపాటు దేశవ్యాప్తంగా ఉత్తమ నిర్వహణ పద్ధతులు స్థిరంగా అమలవుతాయి. బ్రూడ్‌స్టాక్ నిర్వహణ, ప్రజననం, హేచరీ కార్యకలాపాలు, ఉత్పత్తి వ్యవస్థలు, క్వారంటైన్, ఆరోగ్య నిర్వహణ, ట్రేసబిలిటీ, అక్వేరియం కార్యకలాపాలు, నిర్వహణ, రవాణా, వాణిజ్య సంబంధిత పద్ధతులను ఇవి ప్రమాణీకరిస్తాయి. భాగస్వాముల సామర్థ్య బలోపేతం, ఉత్పత్తి నాణ్యత, జీవభద్రత ప్రమాణాల మెరుగుదల, ధ్రువీకరణ, మార్కెట్ సౌలభ్య కల్పన సహా భారత అలంకార మత్స్య పరిశ్రమ సుస్థిర-వ్యవస్థీకృత ప్రపంచవ్యాప్త పోటీతత్వంతో వృద్ధి చెందడానికి ఇవన్నీ మద్దతిస్తాయి.

మొత్తం 11,099 కిలోమీటర్ల తీరప్రాంతం, దాదాపు 24 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రత్యేక ఆర్థిక మండలంతో భారత్‌కు విస్తృత, వైవిధ్య సముద్ర వనరుల అపార సంపద ఉంది. దేశంలోని 'ఈఈజడ్'లో సముద్ర మత్స్య సంపద సామర్థ్యం 58.6 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా. దీనివల్ల సుమారు 50 లక్షల మంది మత్స్యకారుల జీవనోపాధికి మద్దతు లభి?తుంది. అంతేగాక ఆహార భద్రత, పోషణ, ఉపాధి, ఆదాయ సృష్టి, ఎగుమతుల ద్వారా రాబడులకు గణనీయంగా దోహదం చేస్తుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్త అగ్రగామి మత్స్య, ఆక్వాకల్చర్ ఉత్పత్తి దేశాల్లో భారత్ కూడా ఒకటిగా ఉంది. కాబట్టే, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు ?73,890 కోట్ల విలువైన సముద్ర ఆహారోత్పత్తులను ఎగుమతి చేసింది.

చేపల వేట కార్యకలాపాల్లో అధికశాతం తీరానికి 40-50 నాటికల్ మైళ్ల పరిధిలోనే ప్రస్తుతం కేంద్రీకృతమయ్యాయి. అయితే, మరింత లోతులో.. జాతీయ అధికార పరిధికి వెలుపల గల ప్రాంతాల్లో 'టునా' చేపలు, అదే జాతిని పోలిన అధిక విలువగల మత్స్య సంపద వేటకు గణనీయ అవకాశాలున్నాయి. సుస్థిర సముద్ర మత్స్య సంపద వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, మన 'ఈఈజడ్' పరిధిలోనే కాకుండా బహిరంగ సముద్ర జలాల నుంచి మత్స్య సంపద సుస్థిర వినియోగానికి వీలు కల్పించే చట్రాన్ని రూపొందించింది. ఈ మేరకు 'భారత పతాకం గల వేట నౌకల ద్వారా సముద్రపు లోతుల్లోని మత్స్య సంపద సుస్థిర వినియోగానికి మార్గదర్శకాలు-2025'ను కూడా జారీచేసింది.

లక్షద్వీప్ ప్రాంతంలో సముద్ర మత్స్య వనరులు సమృద్ధిగా ఉన్నాయి. ముఖ్యంగా- యెల్లోఫిన్ స్కిప్‌జాక్ టునా చేపలు సహా అధిక విలువగల ఆ జాతి మత్స్య సంపద ఇక్కడ అపారం. ఈ ద్వీప సముద్ర మత్స్య రంగానికి ఇవే వెన్నెముకగా నిలుస్తున్నాయి. సువిశాల, సారవంతమైన జలాల ద్వారా వాణిజ్యపరంగా కీలకమైన ఈ జాతుల సుస్థిర వేటకు, విలువ జోడించడానికి, ఎగుమతుల వృద్ధికి, జీవనోపాధి కల్పనకు అవకాశాలు గణనీయంగా ఉంటాయి. ఆ మేరకు టునా ఆధారిత మత్స్య పరిశ్రమతో పాటు నీలి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి లక్షద్వీప్ ఓ కీలక కూడలిగా నిలుస్తోంది.

# పటిష్ఠ భద్రత, నిరంతర పర్యవేక్షణతో దేశవ్యాప్తంగా విజయవంతంగా పూర్తయిన నీట్-పీజీ 2026 పరీక్ష

న్యూఢిల్లీ, ఆగష్టు 31:నిష్పక్షపాత, సురక్షిత, అవాంతరాలు లేని పరీక్షా ప్రక్రియను నిర్ధారించడం కోసం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎమ్ఎస్)... సమగ్రమైన రవాణా, సాంకేతిక, భద్రత, మానవ వనరుల పరమైన ఏర్పాట్లతో ఈ రోజు దేశవ్యాప్తంగా నీట్-పీజీ 2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఉన్న 1,111 పరీక్షా కేంద్రాల్లో 2,73,096 మంది అభ్యర్థుల కోసం ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2,65,980 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా, సుమారు 2,63,535 మంది అభ్యర్థులు పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు.

దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్ష కోసం నిరంతర పర్యవేక్షణ, కఠినమైన భద్రతా చర్యలు చేపట్టారు. పరీక్ష నిర్వహణను పర్యవేక్షించడానికి మొత్తం 2,527 మంది బోధనా సిబ్బందిని స్వతంత్ర పరిశీలకులుగా నియమించారు. దీనికి అదనంగా, డీన్‌లు, డైరెక్టర్‌లు, మెడికల్ సూపరింటెండెంట్‌లు, సీనియర్ ప్రొఫెసర్‌లు సహా 700 మందికి పైగా సీనియర్ బోధనా సిబ్బందిని ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేశారు.

సమన్వయం, పర్యవేక్షణ బలోపేతం కోసం, దేశవ్యాప్తంగా 16 ఎన్‌బీఈఎమ్ఎస్ ప్రాంతీయ కమాండ్ కేంద్రాలను కార్యాచరణలోకి తీసుకువచ్చారు.

పరీక్షా కేంద్రాలనూ లైవ్ సీసీటీవీ నిఘాలో ఉంచారు. దీనిని ద్వారకలోని ప్రధాన కార్యాలయంలో ఉన్న ఎన్‌బీఈఎమ్ఎస్ కమాండ్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. నిరంతర నిఘా, పర్యవేక్షణ కోసం ఎన్‌బీఈఎమ్ఎస్, టీసీఎస్‌ల నుంచి 190 మంది సిబ్బందితో ఒక ప్రత్యేక బృందాన్ని నియమించారు.

ఎన్‌బీఈఎమ్ఎస్ ప్రధాన కార్యాలయంలోని ప్రత్యేక కమాండ్ సెంటర్‌లో... ఎన్‌బీఈఎమ్ఎస్, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, బీఈఎల్, ఈసీఐఎల్, టీసీఎస్ అధికారులు రోజంతా పరీక్షా ప్రక్రియను నిశితంగా, నిరంతరం పర్యవేక్షించారు.

పరీక్ష కోసం భద్రతను మరింత పటిష్ఠం చేయడానికి, నకిలీ అభ్యర్థులను నివారించడానికి తీసుకున్న చర్యల్లో భాగంగా... పరీక్షా కేంద్రాల్లో ఆధార్ ఆధారిత ధ్రువీకరణను విజయవంతంగా నిర్వహించారు. పరీక్షను సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించడానికి ప్రభుత్వ సంస్థలు తమ పూర్తి మద్దతును అందించాయి.

దేశవ్యాప్తంగా అత్యధిక శాతం అభ్యర్థులకు పరీక్ష విజయవంతంగా పూర్తయినప్పటికీ, పరీక్ష నిర్వహణ సంస్థ అయిన ఎమ్/ఎస్ టీసీఎస్ లిమిటెడ్ కారణంగా... రాజస్థాన్‌లోని జైపూర్‌లోని ఐఓఎన్ డిజిటల్ జోన్, ఐడిజెడ్ సితాపుర కేంద్రాల్లో (పరీక్షా కేంద్రాల సంఖ్య. 41682, 41683) ఊహించని సాంకేతిక అంతరాయం ఏర్పడింది. దీనివల్ల ఈ పరీక్షా కేంద్రాల్లో అంతర్గత విద్యుత్ సరఫరా సమస్యల కారణంగా 2,445 మంది అభ్యర్థులు పరీక్ష రాయలేకపోయారు.

ప్రభావిత అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి ఎన్‌బీఈఎమ్ఎస్ చింతిస్తోంది. వారికి నీట్ పీజీ-2026 పరీక్షకు హాజరయ్యేందుకు న్యాయమైన, సమానమైన అవకాశం కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టింది.

దీనికి అనుగుణంగా, ఈ అభ్యర్థులందరికీ 2026 సెప్టెంబర్ 5వ తేదీ శనివారం మధ్యాహ్నం 3:00 గంటలకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. వేదిక వివరాలు, పరీక్ష సంబంధిత ఇతర సూచనలు సంబంధిత అభ్యర్థులకు విడిగా తెలియజేస్తారు.

339 నగరాల్లోని 1,111 కేంద్రాల్లో పరీక్షను విజయవంతంగా నిర్వహించడం... ఈ దేశవ్యాప్త కార్యక్రమంలో పాలుపంచుకున్న పరీక్షా అధికారులు, వైద్య సంస్థలు, అధ్యాపకులు, భద్రతా సంస్థలు, సాంకేతిక బృందాలు, ఇతర భాగస్వాముల మధ్య విస్తృత సమన్వయాన్ని ప్రతిబింబిస్తుంది.

అభ్యర్థుల సహకారం, సహనం, నమ్మకాన్ని ఎన్‌బీఈఎమ్ఎస్ అభినందిస్తోంది. నీట్-పీజీ 2026 నిర్వహణతో సంబంధం ఉన్న సిబ్బంది, సంస్థలందరి అంకితభావంతో కూడిన కృషినీ గుర్తిస్తోంది.

# హామీల అమలుపై బీఆర్ఎస్ వారం రోజుల నిరసనలు

## మాజీ ఎమ్మెల్యే డా॥ గాదరి కిషోర్ కుమార్

నల్గొండ, ఆగష్టు 31: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిషోర్ కుమార్ ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం దాచారం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భూముల వ్యవహారంలో ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలిగిస్తోందని, 22ఏ నిషేధిత జాబితా పేరుతో భారీగా భూములను చేర్చారని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్



ప్రభుత్వం 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

సెప్టెంబర్ 2న తుంగతుర్తిలో నియోజకవర్గ స్థాయి నిరసన ధర్నా, సెప్టెంబర్ 3న మిర్యాలగూడలో వ్యవసాయం, కృష్ణా జలాల అంశాలపై నిర్వహించే సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని చెప్పారు.

# రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ ఆకస్మిక తనిఖీ



నల్గొండ, ఆగష్టు 31: రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయన ముందుగా పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ ఆవరణను పచ్చదనంతో ఉంచాలని సూచిస్తూ మొక్కలు నాటారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న కేసుల ఫైళ్లు, రికార్డులు, కంప్యూటర్ వ్యవస్థ పనితీరు, సీసీ కెమెరాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.

పట్టణంలో నమోదైన పలు కేసుల పురోగతిపై సీఐ పరస రమేష్, ఎస్ఐ జాడి శ్రీధర్‌తో ఏసీపీ చర్చించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో స్టేషన్ ఇన్‌చార్జి నరసయ్య, హెడ్ కానిస్టేబుళ్లు కంకజంగు, వెంకటేశ్వర్లు, అఖిల్‌రెడ్డి, సునీల్‌కుమార్, సీసీటీఎన్ఎస్ సిబ్బంది బాలకృష్ణ, సాయికృష్ణ, మహిళా కానిస్టేబుల్ రమ్య, ఇతర స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.43.85 కోట్ల పనులకు శ్రీకారం : డిప్యూటీ సీఎం భట్టి

**నర్సింగ్ కళాశాల నుంచి కొత్త రహదారుల వరకు భారీ అభివృద్ధి పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన**

**ఓటు హక్కు పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం పిలుపు**




ఖమ్మం, ఆగష్టు 31:మధిర నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు వేగం పెంచుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు, నర్సింగ్ కళాశాల, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. విద్య, వైద్యం, రహదారి సౌకర్యాలను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. బోనకల్ మండలం జానకీపురం గ్రామంలో బూత్ స్థాయి ఏజెంట్లతో జరిగిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ఓటు హక్కు రక్షణలో బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు దక్కేలా చూడాలని సూచించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాల వివరాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని బూత్ స్థాయి ఏజెంట్లకు సూచించారు. గత 40 రోజులుగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తున్న వారి సేవలను భట్టి విక్రమార్క అభినందించారు.

లచ్చగూడెంలో రూ.37.75 కోట్ల పనులు

చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో రూ.37.75 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.29 కోట్లతో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనం నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే రూ.7 కోట్లతో చింతకాని?వందనం రహదారి నుంచి లచ్చగూడెం?నేరడ వరకు బీటీ రహదారి, రూ.1.75 కోట్లతో లచ్చగూడెం?అనంతారం బీటీ రహదారి నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తయితే లచ్చగూడెంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు

చింతకాని మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ.44 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే మధిర నియోజకవర్గం పరిధిలోని కోదుమూరు గ్రామ ఎస్సీ కాలనీలో కూడా అంతర్గత సీసీ రహదారుల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రజలతో, ముఖ్యంగా రైతు కూలీలతో మాట్లాడిన భట్టి విక్రమార్క, ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు.

చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో రూ.6.10 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూడా డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. రూ.5.25 కోట్లతో నాగిలిగొండ నుంచి తుతికుంట వరకు బీటీ రహదారి నిర్మాణం, రూ.85 లక్షలతో నాగిలిగొండ ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. మెరుగైన రహదారులు, విద్యా-వైద్య సదుపాయాలు, గ్రామీణ మౌలిక వసతుల కల్పన ద్వారా మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే జారేకు తృటిలో తప్పిన ప్రమాదం

ఖమ్మం, ఆగష్టు 31: అశ్వా రావుపేట ఎమ్మెల్యే జారే ఆదినాాయణకు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటు కారులో ప్రయాణిస్తున్న వారంద´రూ క్షేమంగా ఉన్నట్లు ఎమ్మెల్యే వర్గాలు తెలిపాయి. ప్రమాదంలో కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతిన్నట్లు సమాచారం.

అశ్వారావుపేట పర్యటన ముగించుకుని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చంద్రుగొండ వైపు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఎర్రగుంట దాటిన తర్వాత మద్దుకూరు సమీపంలో అకస్మాత్తుగా ఓ గేదె రోడ్డుపైకి వచ్చింది. దీంతో డ్రైవర్ అప్రమత్తమై వెంటనే స్పందించినప్పటికీ కారు గేదెను ఢీకొన్నట్లు తెలిసింది.

అయితే డ్రైవర్ సమయస్ఫూర్తితో పెద్ద ప్రమాదం తప్పింది. కారులో ఉన్న ఎమ్మెల్యేతో పాటు ఇతరులకు ఎలాంటి గాయాలు కాలేదని, జారే ఆదినారాయణ ప్రస్తుతం పూర్తిగా క్షేమంగా ఉన్నారని ఎమ్మెల్యే వర్గాలు వెల్లడించాయి. ఘటన అనంతరం ఆయన ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లను కొనసాగించారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముత్యాల సునీల్‌కుమార్



నిజామాబాద్, ఆగష్టు 31: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం సుదర్శన్‌నగర్ తండాలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అనంతరం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు అంబేద్కర్ తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. 'విద్యను అభ్యసించండి.. చైతన్యవంతులై పోరాడండి.. సంఘటితం కండి' అనే అంబేద్కర్ సందేశం నేటి తరానికి కూడా మార్గదర్శకమని అన్నారు.

అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయాన్ని కల్పించిందని ముత్యాల సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, విద్య ద్వారానే సమాజంలో చైతన్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసిన కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్, ఆగష్టు 31: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం పిప్రి (జె) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం కాంగ్రెస్ నాయకులు ముగ్గు పోసి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి గ్రామాన్ని గుడిసెలు లేని గ్రామంగా మార్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# దేశంలోని 18 నిఫ్ట్ పట్టభద్ర విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురానున్న సంయుక్త స్నాతకోత్సవం

న్యూఢిల్లీ, ఆగష్టు 31:నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) కి అధికారిక విజిటర్‌గా ఉన్న రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఆగస్టు 31న న్యూఢిల్లీలో జరిగే నిఫ్ట్ సంయుక్త స్నాతకోత్సవానికి (2026) వ ం ం ఖ ్ య అ తి ది: ౧ా హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 18 నిఫ్ట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రంలో ఒకే వేదికపై చేరి తమ విద్యాభ్యాస ప్రయాణం ముగింపు దశకు గుర్తుగా డిగ్రీలను అందుకుంటారు. ఉత్తీర్ణులైన విద్యార్థుల విద్యా ప్రతిభను, సృజనాత్మకతను, నిబద్ధతను, వారు సాధించిన విజయాలను కూడా గుర్తించి ఈ కార్యక్రమం గౌరవిస్తుంది.

కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్‌తో పాటు ఇతర ప్రముఖులు, గవర్నర్ల బోర్డ్ సభ్యులు, ఉన్నతాధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, పట్టభద్రులైన విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరుకా నున్నారు.

నిఫ్ట్ లో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థుల విజయాలను ఈ స్నాతకోత్సవం ఘనమైన వేడుకగా నిర్వహించడంతో పాటు, సంస్థలో విద్యాభ్యాస కాలంలో వారు ప్రదర్శించిన విద్యా ప్రతిభ, సృజనాత్మకత, అంకితభావం, అందించిన సేవలు, చేసిన కృషిని గుర్తించి అభినందించనుంది. అన్ని క్యాంపస్‌లలోని ప్రతి ప్రోగ్రామ్‌లో అత్యధిక సీజీపీఏ సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను బంగారు పతకాలతో సత్కరిస్తారు.

స్నాతకోత్సవం అనంతరం ఆయా క్యాంపస్‌ల వారీగా డిగ్రీల ప్రదానోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటిలో పట్టభద్ర విద్యార్థులు విద్యాభ్యాస దశను పూర్తి చేసుకుని వృత్తిపరమైన జీవితంలోకి అడుగుపెట్టే కీలక ఘట్టంగా అధికారికంగా తమ డిగ్రీలను అందుకుంటారు.

నిఫ్ట్ చట్టం?2006 కు అనుగుణంగా కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ 1986లో ఒక చట్టబద్ధ సంస్థగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఈ సంస్థ ఫ్యాషన్ విద్యలో ప్రముఖ సంస్థగా ఎదిగింది. సంప్రదాయ కళలు, హస్తకళలు, విద్యా పరిజ్ఞానం, డిజైన్‌లో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సృజనాత్మక ఆలోచనలు, పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని సమన్వయం చేస్తూ ఫ్యాషన్ రంగానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తోంది.

దేశవ్యాప్తంగా వృత్తిపరంగా నిర్వహిస్తున్న 20 క్యాంపస్‌లతో సమ్మిళిత, చైతన్యవంతమైన విద్యా వాతావరణాన్ని కొనసాగిస్తూ యువ ప్రతిభకు విజ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మక సామర్థ్యాలను నిఫ్ట్ అందిస్తోంది. భారతదేశ ఫ్యాషన్, సృజనాత్మక పరిశ్రమల అభివృద్ధికి వారు తమ వంతు కృషి చేసేలా తీర్చిదిద్దుతోంది.

ఆలోచనలను అవకాశా లు సృజనాత్మకతను ప్రభావవంతమైన ఫలితాలుగా మలచడం నేర్చుకున్న ఒక తరం విజయాలను వేడుకగా జరుపుకునే సందర్భంగా ఈ ఉమ్మడి స్నాతకోత్సవం నిలవనుంది. పట్టభద్ర విద్యార్థులు నిఫ్ట్‌ను వీడి వృత్తిపరమైన ప్రపంచంలోకి అడుగుపెడుతున్న వేళ, కొత్త కథనాలను ఆవిష్కరించడం, అర్థవంతమైన పరిష్కారాలను రూపొందించడం, భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న సృజనాత్మక రంగానికి తమ వంతు కృషి చేయగలమనే ఆత్మవిశ్వాసాన్ని తమతో తీసుకెళ్లనున్నారు. నిఫ్ట్‌లో వారి విద్యాభ్యాస ప్రయాణం అధికారికంగా ముగింపు దశకు చేరుకున్నప్పటికీ, ఊహాశక్తి, నూతన ఆవిష్కరణలు, ప్రతిభా నైపుణ్యాల వైపు వారి అసలైన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమవుతోంది.

సాధించిన విజయాల వేడుకగానే కాకుండా, భవిష్యత్తుకు ఒక వేదికగా ఈ సందర్భం నిలుస్తుంది. ఉత్తీర్ణులైన విద్యార్థుల విజయాలను గౌరవిస్తూనే, ఆధునిక భారత ఫ్యాషన్, డిజైన్, సృజనాత్మక రంగాల రూపురేఖలను తీర్చిదిద్దడంలో వారు పోషించబోయే పాత్రను ఈ వేడుక ఆవిష్కరిస్తుంది. వారి ప్రతిభ, చొరవ, ఆలోచనా విధానంతోనే మరింత సృజనాత్మక, వినూత్న, ప్రపంచంతో అనుసంధానమైన వికసిత భారత్ లక్ష్యం ముడిపడి ఉంది.

నిఫ్ట్ నుంచి సృజనాత్మకత, అత్యుత్తమ ప్రతిభతో పట్టభద్రులవుతున్న విద్యార్థుల బృందం భారతదేశ ఫ్యాషన్, సృజనాత్మక రంగాల్లో కొత్త కథనాలకు రూపకల్పన చేసేందుకు సిద్ధంగా ఉంది. సంస్థలో వారి విద్యాభ్యాస ప్రయాణం ముగిసినప్పటికీ, నూతన ఆవిష్కరణలు, సానుకూల ప్రభావాన్ని సృష్టించే వారి ప్రయాణం ఇప్పుడే ప్రారంభమవుతోంది.

# చేంగల్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నిజామాబాద్, ఆగష్టు 31: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం చేంగల్ గ్రామంలో నలుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ చొరవతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి పథకం ఆర్థికంగా ఎంతో అండగా నిలుస్తోందని గ్రామ సర్పంచ్ ధుమాల మమత (రాజు) అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్, ఏఎంసీ డైరెక్టర్ నర్సాపురం జీవన్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆర్మూర్ రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నూతుల రమేష్, గిరిని నర్సారెడ్డి, నూతుల వసంత్‌రెడ్డి, అడపా రాజేశ్వర్, శోభన్‌గౌడ్, తూర్పు శ్రీధర్, ప్రశాంత్‌గౌడ్, బాబాగౌడ్, చెవ్వ ప్రశాంత్, కారోబార్ చందు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముత్యాల సునీల్‌కుమార్

నిజామాబాద్, ఆగష్టు 31:నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం సుదర్శన్‌నగర్ తండాలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అనంతరం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు అంబేద్కర్ తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. 'విద్యను అభ్యసించండి.. చైతన్యవంతులై పోరాడండి.. సంఘటితం కండి' అనే అంబేద్కర్ సందేశం నేటి తరానికి కూడా మార్గదర్శకమని అన్నారు.

అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయాన్ని కల్పించిందని ముత్యాల సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, విద్య ద్వారానే సమాజంలో చైతన్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ములుగు వెంకటాపూర్ MRPS MSP నూతన మండల కమిటీల ఎన్నిక

## సెప్టెంబర్ 9న చలో వరంగల్ ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభను విజయవంతం చేద్దాం.. అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దాం..

## MRPS MSP ములుగు జిల్లా ఇన్చార్జ్ చాతల్ల రమేష్ మాదిగ



ములుగు ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా కేంద్రంలో ములుగు మండల కమిటీ రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో MRPS MSP నూతన మండల కమిటీ సమావేశం ములుగు వెంకటాపూర్ మండలాల ఇన్చార్జి కాడపాక శ్యామ్ కో ఇన్చార్జ్ మరాటి రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా MRPS MSP ములుగు జిల్లా ఇన్చార్జి చాతల్లా రమేష్ హాజరై మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి పిలుపు మేరకు సెప్టెంబర్ 9న వరంగల్ లో జరుగబోయే జాతీయ ఎంఆర్పిఎస్ ఎంఎస్పి నూతన మండల కమిటీ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. అస లు లేని సమాజ నిర్మాణకై ముందుకు నడువాలని అన్నారు. పద్మశ్రీ మంద కృష్ణ గారి పిలుపు మేరకు సామాజిక, ఆర్థిక అసమానతల పై భవిష్యత్ ఉద్యమం జరుగుతుంది అని సమాజంలో అందరిని కలిపి ఉద్యమాలకు సిద్ధం చేయాలని అన్నారు..

అనంతరం నూతన MRPS MSP ములుగు వెంకటాపూర్ మండలాల కమిటీలను ఎన్నుకోవడం జరిగింది

ములుగు MRPS అధ్యక్షులుగా ఎనగందుల నరేష్ MRPS ఉపాధ్యక్షులు బోట్ల డేవిడ్ అధికార ప్రతినిధి బలుగూరి శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శి గాదెపాక నందు ములుగు ఓూఖ మండల అధ్యక్షులు ఇనుముల అనిల్ , ఉపాధ్యక్షులు రెంటాల రవి , ప్రధాన కార్యదర్శి అంతర్పుల శంకర్ MSP అధికార ప్రతినిధిగా పొన్నాల తిరుపతి గౌరవ అధ్యక్షులు మేకల సంజీవ మాట్ల బద్రి బస్ , వెంకటాపూర్ MRPS, నూతన మండల అధ్యక్షులు దోమ్మటి రమేష్, అధికార ప్రతినిధి గడ్డమీది అశోక్, ఉపాధ్యక్షులు అల్లకొండ కుమార్, MSP వెంకటాపూర్ మండల అధ్యక్షులు బండారి ప్రణయ్, అధికార ప్రతినిధి గడ్డమీది సృజన్, ఉపాధ్యక్షులు అంబాల రాజు

ఈ కార్యక్రమంలో. బలుగూరి కళ్యాణ్ తిక్క స్వామి పారునందుల నవీన్ దేవునూరు సన్నీ గడ్డమీది అశోక్ ఎంపెల్లి రాంబాబు పోలేపాక మల్లయ్య మేకల శంకర్ పొన్నాల తిరుపతి అంతడుపుల శంకర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# నిబద్ధతతో సేవలందించిన ఎస్ఐలకు ఘన వీడ్కోలు

## కిష్టారెడ్డి, పవన్, రఫ్ఫిక్ సేవలు ప్రశంసనీయం



సంగారెడ్డి, ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి):ఉద్యోగ జీవితంలో ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందడం ఎంతో గొప్ప విషయమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఎస్ఐలు కిష్టారెడ్డి, పవన్, రఫ్ఫిక్‌లకు సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి వారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన అధికారుల సేవలను ఎస్పీ అభినందించారు. ఉద్యోగ విజయవంతంగా విధులు నిర్వర్తించడంలో కుటుంబ సభ్యుల సహకారం, బాధ్యత కూడా కీలకమని పేర్కొన్నారు. ఎస్ఐ కిష్టారెడ్డి సివిల్ పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి ఉమ్మడి మెదక్ జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించారని తెలిపారు. ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా అంచెలంచెలుగా పదోన్నతులు పొంది ఎస్ఐ స్థాయికి ఎదగడం ఆయన నిబద్ధత, క్రమశిక్షణకు నిదర్శనమన్నారు.

ఎస్ఐ పవన్ కూడా సివిల్ పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి ఉమ్మడి మెదక్ జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలతో పాటు గ్రేహౌండ్స్ విభాగంలో ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించారని ఎస్పీ తెలిపారు. సుదీర్ఘకాలం విశిష్ట సేవలందించి ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా పదోన్నతులు పొందడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఎస్ఐ రఫ్ఫిక్ సైతం సివిల్ పోలీసు కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు.

వ ం ం గ ్ ం ం ్ ా ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు శాఖ తరఫున వారికి, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, పరిపాలనా అధికారి పద్మావతి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఆర్ఐ సురేష్, పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐల కుటుంబ సభ్యులు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దళితుల గౌరవానికి భంగం కలిగించారంటూ పోలీసులకు ఫిర్యాదు

మహబూబ్‌నగర్, ఆగష్టు 31:ఖర్గే పర్యటన సందర్భంగా దళితుల గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించారని ఆరోపిస్తూ టీపీసీసీ ఎస్సీ సెల్ నాయకులు సోమవారం భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళితుల గౌరవం, రాజ్యాంగ హక్కులు, సామాజిక సమానత్వాన్ని కాపాడేలా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఘటనకు బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా దళితుల హక్కులకు భంగం కలిగించే ఘటనలను ఉపేక్షించరాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బాధ్యులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లయ్య, శంకర్, బాలరాజు, నరేష్, వెంకటయ్య, యాదయ్య, శ్రీను, బాలు, ముని తదితరులు పాల్గొన్నారు.

# కులగణనను నిబద్ధతతో చేపట్టాలి : పరికిపండ్ల అశోక్

హన్మకొండ, ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి) కులగణన-2027 శాస్త్రీయంగా నిబద్ధతతో జరగాలని లేకపోతే బీసీలకు మరో దశాబ్ద కాలం తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని, ప్రపంచంలో ఏ గ్రూపుకు జరగని అన్యాయం 80 సంవత్సరాల స్వాతంత్ర భారతదేశంలో జరుగుతుందని బీసీ ఉద్యమ నాయకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు.

సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో 'ఓపెన్ కాస్ట్ కాలం క్లోజ్డ్ జస్టిస్- ది ఇంజస్టిస్ ఇన్ సెన్సెస్-2027' అనే అంశంపై జరిగిన సమావేశంలో సెన్సెస్-2027లో బీసీలకు జరగబోయే అన్యాయం గురించి శాస్త్రీయంగా విశ్లేషించారు.

# బాధిత కుటుంబానికి -20,000 ఆర్థిక సాయం



ములుగు ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): చిన్నారుల మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమై, బాధిత కుటుంబానికి -20,000 ఆర్థిక సాయం అందించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన మాలోతు స్వాతి-యాకూబ్ దంపతులు రాఖీ పండుగ సందర్భంగా ములుగు మండలం గణేష్ లాల్ గ్రామంలోని తమ పుట్టింటికి వచ్చారు. ఈ క్రమంలో వారి కుమారులు మాలోత్ వినయ్, రాజేష్‌లు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందారు.

అన్నదమ్ములిద్దరూ మరణించిన విషాదకర ఘటన తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చిన్నారుల మృతదేహాలను చూసి తీవ్రగ్భ్రాంతికి గురైన లక్ష్మణ్ బాబు కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ తన వంతుగా ?20,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మృతి చెందిన పిల్లల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాటి కృష్ణ, కుడుముల లక్ష్మీనారాయణ, కాకులమర్రి ప్రదీప్ రావు, తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్ గౌడ్, ఎండి వలీ బాబా, తుక్కాని శ్రీనివాస్, సిద్ధంశెట్టి లక్ష్మణరావు, పప్పు వెంకట్ రెడ్డి, ఎండి కుర్బాన్ అలీ, చల్లగరుగుల తిరుపతి, పబ్బోజు సత్యనారాయణ చారి, వస్త్రం నాయక్, చీకుర్తి సుధాకర్, డీజే రాజేష్, యలవర్తి శ్రీనివాసరావు, గుడిసేవ నాగేశ్వరరావు, బీస సాంబయ్య, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, పంజాల సత్యం, గంగుల శ్రీనివాస్, గోమస చంద్రరావు, యాదడ్ల రాజయ్య, దోమల నరసయ్య, ఆకుల ప్రభాకర్, దామోదర్, గద్దల రఘు, అనురాధ, తిరుపతమ్మ, జెట్టి లక్ష్మి, రామరాజు, ఇట్టబోయిన సాంబయ్య, తుక్కాను పవన్, ఉమేష్, గుగులోతు చందర్రావు, గూగులోతు శ్రీను, రాంబాబు, కొమరం రాంబాబు, జాడి రవి, జెట్టి రవి, శ్రీహరి తదితరులు పాల్గొని చిన్నారుల మృతదేహాలకు నివాళులర్పించారు.

# అనిశ్చితి తీరాన అభయహస్తం: డెబ్బై వసంతాల ఎల్.ఐ.సి. విజయప్రస్థానం

సెప్టెంబరు 1 భారతీయ జీవిత బీమా చరిత్రలో ఒక సువర్ణాక్షర లిఖిత దినం. జీవితపు ఒడిదుడుకుల్లో చీకట్లు ముసిరిన వేళ కోట్లాది గృహాలకు వెలుగుదివ్వెగా నిలిచి, అనిశ్చితి అనే సుడిగుండం నుంచి కుటుంబ నావను ఒడ్డుకు చేర్చే అభయహస్తంగా అవతరించిన భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్.ఐ.సి.) ఆవిర్భవించిన మహోన్నత సందర్భం ఇది. 1956 సెప్టెంబరు 1న జాతికి అంకితమైన ఈ సంస్థ, 2026 సెప్టెంబరు 1తో తన విశిష్ట ప్రస్థానంలో ఏడు దశాబ్దాల మైలురాయిని అధిగమించి 70వ పడిలోకి సగర్వంగా అడుగుపెడుతోంది. ఒక ఆర్థిక సంస్థ ఆవిర్భావ దినోత్సవం సాధారణంగా వ్యాపార విజయాల సంబరమే అయినప్పటికీ, ఎల్.ఐ.సి. విషయానికి వస్తే అది స్వతంత్ర భారతదేశ ఆర్థిక సార్వభౌమత్వానికి, సామాజిక భద్రతా పరిణామక్రమానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. భగవద్గీతలోని 'యోగక్షేమం వహామ్యహమ్' (మీ యోగక్షేమాల బాధ్యత నాది) అన్న మహోన్నత సూక్తిని ధ్యేయవాక్యంగా స్వీకరించి, 'జీవితాంతం తోడుండే నమ్మకం'గా కోట్లాది భారతీయుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. దేశంలో బీమా అనే భావనను కేవలం ఉన్నత వర్గాల విలాసంగా కాకుండా, సామాన్య ప్రజానీకానికి ప్రాథమిక ఆర్థిక హక్కుగా మలచి, పొదుపు సంస్కృతిని పల్లె పల్లెకూ విస్తరింపజేయడంలో ఈ సంస్థ పోషించిన పాత్ర అద్వితీయం, అనితరసాధ్యం.

భారత గడ్డపై ఆధునిక జీవిత బీమా వ్యవస్థ ఆనవాళ్లు బ్రిటిష్ పాలనా కాలపు నాటి ప్రాచీన పునాదులపై నిర్మితమయ్యాయి. 1818లో కలకత్తాలో ఆవిర్భవించిన 'ఓరియంటల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ'తో దేశంలో ఆధునిక బీమా కార్యకలాపాలకు నాంది పలకగా, 1870లో స్థాపింపబడిన 'బాంబే మ్యూచువల్ లైఫ్ అష్యూరెన్స్ సొసైటీ' తొలి స్వదేశీ జీవిత బీమా సంస్థగా చరిత్ర సృష్టించింది. ఆ తర్వాత స్వాతంత్ర్య సమర కాలంలో స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో అనేక దేశీయ బీమా సంస్థలు పుట్టుకొచ్చినప్పటికీ, పటిష్ఠమైన నియంత్రణ లేకపోవడంతో సంస్థాగత లోపాలు తీవ్రమయ్యాయి. 1912 నాటి లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీస్ యాక్ట్, ప్రావిడెంట్ ఫండ్ యాక్ట్ ద్వారా తొలిసారిగా శాసనపరమైన అడుగులు పడగా, 1928 చట్టం సమాచార సేకరణను క్రమబద్ధీకరించింది; తదనంతరం 1938 నాటి సమగ్ర బీమా చట్టం ద్వారా ప్రభుత్వం రంగంపై పట్టు సాధించింది. అయినప్పటికీ, 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కూడా ప్రైవేటు సంస్థల చేతుల్లో బీమా రంగం కేవలం లాభాపేక్షతో, పట్టణ ప్రాంతాలకే పరిమితమై కునారిల్లింది. ఆర్థికంగా బలహీనమైన పలు ప్రైవేటు కంపెనీలు దివాళా తీసి సామాన్య బీమాదారులను నట్టేట ముంచడంతో, ప్రజల కష్టార్జితానికి రక్షణ కల్పించి, బీమా ఫలాలను దేశంలోని ప్రతి పల్లెకూ అందించాలనే లక్ష్యంతో జీవిత బీమా రంగాన్ని జాతీయీకరించాలనే చారిత్రక నిర్ణయం రూపుదిద్దుకుంది.

తదనుగుణంగా 1956 జనవరి 19న కేంద్ర ప్రభుత్వం జాతీయీకరణ ఆర్డినెన్స్‌ను జారీ చేయగా, అప్పట్లో దేశంలో కార్యకలాపాలు సాగిస్తున్న 154 భారతీయ సంస్థలు, 16 విదేశీ కంపెనీలు, 75 ప్రావిడెంట్ సొసైటీలతో కలిపి మొత్తం 245 బీమా సంస్థల వ్యాపారాన్ని విలీనం చేస్తూ 1956 జూన్ 19న పార్లమెంటు 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యాక్ట్'ను ఆమోదించింది. ఈ చట్టబద్ధ ప్రక్రియ ద్వారా కేవలం రూ.5 కోట్ల ప్రారంభ ప్రభుత్వ పెట్టుబడితో 1956 సెప్టెంబరు 1న భారతీయ జీవిత బీమా సంస్థ ప్రాణం




పోసుకుంది. ఆవిర్భావ సమయంలో 5 జోనల్, 33 డివిజనల్, 212 శాఖా కార్యాలయాలతో, సుమారు రూ.200 కోట్ల వ్యాపారంతో మొదలైన సంస్థ ప్రస్థానం అప్రతిహతంగా సాగింది. దేశంలోని సుదూర మూలలకు నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ 1969-70 నాటికి రూ.1,000 కోట్ల కొత్త వ్యాపారాన్ని, 1980ల నాటికి రూ.2,000 కోట్లను, 1985-86 నాటికి రూ.7,000 కోట్ల బీమా మొత్తాన్ని అధిగమించి ఆర్థిక దిగ్గజంగా రూపాంతరం చెందింది. 1990ల ఆర్థిక సరళీకరణల కాలంలో ఆర్.ఎన్. మల్హోత్రా కమిటీ సిఫారసుల మేరకు 1999లో ఐఆర్‌డీఏ చట్టం వచ్చి, ప్రైవేటు సంస్థలకు ద్వారాలు తెరిచినా, ఎల్.ఐ.సి. తన తిరుగులేని ప్రజావిశ్వాసంతో మార్కెట్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది.

ప్రస్తుతం 2026 నాటికి ఎల్.ఐ.సి. దేశవ్యాప్తంగా 2,048 పూర్తిగా కంప్యూటరీకరించిన శాఖలు, 113 డివిజనల్ కార్యాలయాలు, 8 జోనల్ కేంద్రాలు, 1,381 శాటిలైట్ కార్యాలయాలతో అత్యంత విస్తృతమైన డిజిటల్, భౌతిక సేవలను అందిస్తోంది. 2026 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సర అధికారిక నివేదికల ప్రకారం సంస్థ వ్యక్తిగత కొత్త వ్యాపారంలో అనుసంధానిత బీమా వాటా 24.22 శాతంగా నమోదు కాగా, సంస్థ నికర నిలుపుదల నిష్పత్తి ఏకంగా 99.86 శాతంగా నమోదై ఆర్థిక పటిష్ఠతను చాటింది. అదేవిధంగా వార్షిక ప్రాతిపదికన నికర విలువలో 38.96 శాతం వృద్ధి సాధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం వ్యక్తిగత ఏజెంట్ల ద్వారానే రికార్డు స్థాయిలో 1,81,49,640 పాలసీలను విక్రయించి, రూ.61,977.31 కోట్ల ప్రీమియంను ఒడిసిపట్టడం భారతీయ ఆర్థిక రంగంలో ఈ మానవ వనరుల నెట్‌వర్క్ ఎంతటి శక్తిమంతమైనదో నిరూపిస్తోంది. 2022లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మెగా ఐపీఓ ద్వారా పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా అవతరించి మార్కెట్లో ప్రజాస్వామిక వాటాదారుల భాగస్వామ్యాన్ని సంతరించుకున్నప్పటికీ, సంస్థ మూల లక్ష్యమైన ప్రజా సంక్షేమ దృక్పథం చెక్కుచెదరలేదు.

ఎల్.ఐ.సి. సాధించిన ఘనతను కేవలం బ్యాలెన్స్ షీట్లు, లాభనష్టాల లెక్కలతో కొలవలేము. ఇంటి పెద్దను కోల్పోయి అనాథలైన కుటుంబాలకు అందే క్లెయిమ్ పరిహారం, ఆడపిల్లల వివాహాలకు, ఉన్నత చదువులకు చేదోడయ్యే మెచ్యూరిటీ సొమ్ము, వృద్ధాప్యంలో గౌరవప్రదంగా జీవించేందుకు ఇచ్చే పింఛను భరోసా? ఇవన్నీ భారతీయ సామాజిక జీవన నాణ్యతను పెంచిన వాస్తవ రూపాలు. అంతేకాకుండా పాలసీదారుల నుంచి సేకరించిన పొదుపు నిధులను జాతి నిర్మాణానికి అవసరమైన రైల్వేలు, రహదారులు, విద్యుత్, తాగునీరు, గృహనిర్మాణం వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో దీర్ఘకాలిక పెట్టుబడులుగా మళ్లించి దేశ ప్రగతి చక్రాలను నడపడంలో ఎల్.ఐ.సి. కీలక పాత్ర పోషించింది. "ఇల్లు వెలిగితేనే ఊరు వెలుగుతుంది" అన్న నానుడి ప్రకారం, కుటుంబాల భద్రతే దేశ స్థిరత్వానికి మూలస్తంభం అనే సత్యాన్ని ఆచరణలో చూపిన సంస్థ ఇది.

మారుతున్న ఆధునిక యుగంలో నవతరం ఆలోచనలు, డిజిటల్ పెట్టుబడులు, ఫిన్‌టెక్ ఆవిష్కరణలు, మ్యూచువల్ ఫండ్లు, ప్రైవేటు సంస్థల తీవ్రమైన పోటీ వంటి పెను సవాళ్లు ఎల్.ఐ.సి. ముందున్నాయి. గత ఘనకీర్తిని మాత్రమే నమ్ముకోకుండా, కృత్రిమ మేధస్సు ఆధారిత వేగవంతమైన క్లెయిమ్ పరిష్కారాలు, సరళతరమైన పాలసీ నిబంధనలు, పారదర్శకమైన డిజిటల్ సేవలను యువతరాన్ని ఆకట్టుకునేలా మరింత విస్తరించాల్సి ఉంది. బీమా అనేది తక్షణ లాభాల వ్యాపారం కాదు; అది ముందుచూపుతో తరాల భవిష్యత్తుకు వేసే పటిష్ఠమైన ఆర్థిక పునాది. "ఆపద వచ్చిన తరువాత వెదకడం కంటే, ఆపద రాకముందే అప్రమత్తమై రక్షణ కవచం ధరించడం విజ్ఞత" అన్న సనాతన సూత్రాన్ని నేటి నవతరానికి అర్థమయ్యేలా వివరిస్తూ, కాలపరీక్షకు నిలిచిన నిబద్ధతతో, సాంకేతిక శక్తితో పునరంకితమైనప్పుడే ఎల్.ఐ.సి. రాబోయే దశాబ్దాలలోనూ భారతీయ గృహసీమల్లో ఆశాదీపికగా తన అప్రతిహత విజయయాత్రను కొనసాగించగలదు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## కాంగ్రెస్ సర్కార్ 1000 రోజుల పాలనలో ఉద్ధరించిందేమీ లేదు.!

### కాంగ్రెస్ ది ప్రజాపాలన కాదు.. ప్రజా వ్యతిరేక పాలన....

### బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కళ్యాణ్ చంద్ర



కరీంనగర్, ఆగష్టు 31: (నేటినిజం ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజుల్లో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేసిందేమీ లేదని, ఆరు గ్యారెంటీలు , 420 హామీలు నీటి మూటలు అయ్యాయని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కళ్యాణ్ చంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం రోజున కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ 'ప్రజా పాలన' పేరుతో పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తుందని ఆయన మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు వాగ్దానాలు చేసిందని , ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు, 420 హామీలు పూర్తిగా నీటి మూటలయ్యాయని విమర్శించారు. ఆ హామీల ను అరకొరగా అమలు చేసి నేడు పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. ప్రస్తుతం కొత్తగా రాష్ట్రంలో 22-ఏ చట్టాన్ని తీసుకువచ్చి , భూ యజమానుల ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టిందని ఫైర్ అయ్యారు. ముఖ్యంగా సొంత భూమి హక్కుదారులను కూడా ఇబ్బంది పెట్టేలా వారి భూములను నిషేధిత 22-ఏ జాబితాలో చేర్చడం ద్వారా ప్రభుత్వం రైతులను, సామాన్య ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. నిరుద్యోగ భృతి నీ గాలికి వదిలేసి, యువ డిక్లరేషన్ అటకెక్కించి , .విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ నిధులను విడుదల చేయకుండా ప్రభుత్వం వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి ఉందని ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు .రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు ఇలా ఏ వర్గాన్ని చూసినా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. రుణమాఫీ, భృతి వంటి హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. కాంగ్రెస్ పాలన పూర్తిగా స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా, అధికారమే పరమావధిగా కొనసాగుతుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం పక్కన పెట్టి, కేవలం ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకే ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. ఇది ప్రజా పాలన కాదు, పక్కా ప్రజా వ్యతిరేక పాలన అని ఘాటుగా విమర్శించారు..రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలను, వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని , . ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేసి, గత బిఆర్ఎస్ మాదిరే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.

## వ్యాపార భవిష్యత్తుకు దిశానిర్దేశం

### ప్రామాణ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2026లో మహీంద్రా యూనివర్సిటీలో గ్లోబల్ స్కాలర్స్, పరిశ్రమ ప్రముఖుల సమ్మేళనం

హైదరాబాద్, ఆగష్టు 31:మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన ప్రామాణ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2026 విజయవంతంగా జరిగింది. ఈ సదస్సులో విద్యావేత్తలు, పరిశోధకులు, డాక్టరల్ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు పాల్గొని, డిజిటల్ మరియు సాంకేతికత ఆధారిత ప్రపంచంలో నాయకత్వం, సంస్థలు, మేనేజ్‌మెంట్ పరిశోధన ఏ విధంగా పరిణామం చెందుతున్నాయనే అంశాలను చర్చించారు.

"లీడర్‌షిప్ ఇన్ ది డిజిటల్ ఏజ్" అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ సదస్సుకు మొత్తం 170 పరిశోధనా ప్రతిపాదనలు అందగా, వాటిలో 93 ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. మొత్తం 59 పరిశోధనా ప్రదర్శనలు నిర్వహించగా, ఇందులో 41 పరిశోధనా పత్రాలు, 18 పోస్టర్లు ఉన్నాయి. భారత్‌తో పాటు విదేశాలకు చెందిన 26కు పైగా ప్రముఖ విద్యాసంస్థలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. వీటిలో బకింగ్‌హామ్‌షైర్ న్యూ యూనివర్సిటీ (యూకే), గ్లోబల్‌నెక్స్ట్ యూనివర్సిటీ (మలేషియా), ఎన్ వై యు స్టెర్న్ (న్యూయార్క్), ఐ ఐ ఎం లక్నో, ఐ ఐ టి ఖరగ్‌పూర్, హైదరాబాద్ యూనివర్సిటీ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి.

మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. యజులు మెడూరి మాట్లాడుతూ, "డిజిటల్ యుగంలో నాయకత్వానికి కేవలం సాంకేతిక పరిజ్ఞానం సరిపోదు. మార్పును అర్థం చేసుకోవడం, ఇప్పటికే ఉన్న ఆలోచనలు మరియు విధానాలను ప్రశ్నించడం, మరింత సంక్లిష్టంగా మారుతున్న పరిస్థితుల్లో సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం అవసరం. పరిశోధనలో కచ్చితత్వం, పరిశ్రమ అనుభవం, విద్యా చర్చలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంస్థలు, సమాజాన్ని ప్రభావితం చేస్తున్న సవాళ్లను పరిష్కరించేందుకు ప్రామాణ్ 2026 వేదికను ఏర్పాటు చేయడం మహీంద్రా యూనివర్సిటీ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అని అన్నారు.రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పరిశోధన ఆధారిత వర్క్‌షాప్‌లతో పాటు కీనోట్ ప్రసంగాలు, ఎడిటర్స్ ప్యానెల్, పరిశోధనా ప్రదర్శనలు, పరిశ్రమ?విద్యా రంగ చర్చలు నిర్వహించారు. కాన్ఫరెన్స్‌కు ముందు నిర్వహించిన వర్క్‌షాప్‌లలో రీసెర్చ్ గ్యాప్ గుర్తింపు, గ్రౌండెడ్ థియరీ, కేస్ రీసెర్చ్, క్వాంటిటేటివ్ రీసెర్చ్ డిజైన్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి అంశాలపై శిక్షణ అందించారు. పరిశోధన నాణ్యతను, పద్ధతిశాస్త్రపరమైన కచ్చితత్వాన్ని మెరుగుపరుచుకునేందుకు ఈ వర్క్‌షాప్‌లు పరిశోధకులకు ఆచరణాత్మక అవగాహన కల్పించాయి.మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డా. అనాది శరణ్ పాండే మాట్లాడుతూ, "డిజిటల్ యుగంలో మేనేజ్‌మెంట్‌ను పునర్నిర్వచిస్తున్న ప్రశ్నలపై పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు పరస్పరం చర్చించుకునేందుకు ప్రామాణ్ 2026 ఒక అర్థవంతమైన వేదికను సృష్టించింది. సదస్సులో ప్రదర్శించిన పరిశోధనల నాణ్యత, వైవిధ్యం బలమైన పరిశోధనా పద్ధతులు, వివిధ విభాగాల మధ్య ఆలోచనా విధానం, పరిశ్రమ?విద్యా రంగాల మధ్య మరింత సన్నిహిత సహకారం ఎంత ముఖ్యమో తెలియజేశాయి. ప్రామాణ్ ద్వారా ఏర్పడే చర్చలు, భాగస్వామ్యాలు మరింత బలమైన, ప్రస్తుత అవసరాలకు అనుగుణమైన మేనేజ్‌మెంట్ పరిశోధనకు దోహదపడతాయని ఆశిస్తున్నాం" అని తెలిపారు.

## వేములవాడ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీధర్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి శ్రీధర్ నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మ మధులకు శ్రీధర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నిబద్ధతతో పనిచేస్తూ నాయకులు, కార్యకర్తల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.

## కర్ణాటకలో రైలు ఢీ.. ముగ్గురు ఏపీ వాసుల మృతి

అమరావతి, ఆగష్టు 31:కర్ణాటక రాష్ట్రం బెంగళూరు జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో ముగ్గురు ఏపీ వాసులు దుర్మరణం చెందారు. జిల్లాలోని దొడ్డబల్లాపుర రైల్వేస్టేషన్‌లో ట్రాక్ దాటుతుండగా మహిళతో సహా ఇద్దరు బాలికలు ఈ ఘటనలో మృతి చెందారు. ఆదివారం సెలవు కావడంతో దొడ్డబళ్లపురలోని బంధువుల ఇంటికి రాగా సోమవారం తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.ప్రపంచ మ్యాప్‌లు పరిశీలించడంఈ ప్రమాదంలో హిందూపురానికి చెందిన ఇర్ఫాన (46), రుకియా(13), రాకియా ( 8) అనే బాలికలు చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాలను మార్చురి ఆసుపత్రికి తరలించారు.

## పార్టీలకతీతంగా.. నల్లగొండ కార్పొరేషన్ అభివృద్ధి

నల్గొండ, ఆగష్టు 31:నల్లగొండ నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లను పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తామని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల వరకే రాజకీయ పార్టీలని, ఆ తర్వాత ప్రజా సమస్యలు, అభివృద్ధే ప్రధానమని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నల్లగొండ నగరపాలక సంస్థను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏ డివిజన్‌పై తనకు వివక్ష లేదని, అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

ప్రతిరోజూ ఒక వార్డును సందర్శించి అక్కడి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని మేయర్ తెలిపారు. కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో కోట్ల రూపాయలతో మిగిలిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి లేదా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కొత్తపల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశంకు ఘన స్వాగతం..



కరీంనగర్, ఆగష్టు 31: (నేటినిజం ప్రతినిధి) బీజేపీ రాష్ట్ర పార్టీ సమావేశం నిమిత్తం సోమవారం రోజున హైదరాబాద్‌కు బయలుదేరిన కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశంకు కొత్తపల్లి మండల బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్టమొదటిసారిగా కొత్తపల్లి గ్రామానికి విచ్చేసిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామంలోని బూత్ అధ్యక్షులు, పోలింగ్ బూత్ బాధ్యులు, కార్యకర్తలతో సమావేశమైన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం .. పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత బలోపేతంపై చర్చించి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలోబీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్ ,బీజేపీ తిమ్మాపూర్ మండల మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి, జిల్లా నాయకులు గుంజేటి శివకుమార్ ,బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్ ,కొత్తపల్లి గ్రామ బూత్ అధ్యక్షులు మార్క శ్రీనివాస్ బీఎల్-2 బాధ్యులు గడ్డం లక్ష్మణ్, మార్క శ్రీకాంత్, జెల్ల విజయ్, నోముల మల్లేష్, దుంబాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అరెకటిక సంక్షేమ సంఘం భవనానికి భూమిపూజ నిర్వహించిన విప్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మించనున్న వేములవాడ మండల అరెకటిక సంక్షేమ సంఘం భవనానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించారు.

సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి అవసరమైన సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు తోట రాజు, శేఖర్, శ్రీనివాస్, తుమ్ మధు, నాయకులు కూరగాయల కొమురయ్య, ప్రసాద్, బుట్టి రమేష్, కొలకని రాజు, మల్లేశం, విష్ణు, సిరిగిరి శ్రీకాంత్, గుమ్మడి రాజేష్ గౌడ్, దూలం భూమేష్‌తో పాటు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు..

## వెంకటాపూర్ మండల లక్ష్మీదేవిపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

ములుగు ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రివర్యులు- శ్రీమతి.ఆతీ, , దనసరి.అనసూయ (సీతక్క)గారి ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు-పైడాకుల. అశోక్ గారి సూచనల మేరకు వెంకటాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు-బండి శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో నూతన కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి గారు పాల్గొన్నారు.లక్ష్మీదేవిపేట గ్రామకమిటీకి ఆశావహుల మధ్య పోటీ ఉన్నప్పటికీ పార్టీ అభ్యున్నతి మేరకు,అభివృద్ధికి అడుగులు వేసే దిశగా పార్టీని బలోపేతం చేయటానికై ఏకగ్రీవంగా కమిటీని ఏర్పాటు చేశారు.కాగా...గ్రామకమిటీ అధ్యక్షులుగా గాజవేని. రమేష్ గారిని అధ్యక్షు లుగా గ్రామ కమిటీ ఉపాధ్యక్షులుగా రంగిశెట్టి రవి గారిని ఎన్నుకోవడం జరిగింది. వారు మాట్లాడుతూ పార్టీ కోసం వేము కష్టపడుతూ పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తూ ముందుకు పోతామని వారు చెప్పారు.కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటూ ఎలాంటి భేదాభిప్రా యాలు లేకుండా పని చేస్తామని హామీ ఇచ్చారు...

ఈ కార్యక్రమంలో భాగంగ లక్ష్మీదేవిపేట గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్,ఉపసర్పంచ్ కొండ తిరుపతి,వెంకటాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు-కట్టెకోళ్ల వెంకటేష్ యాదవ్, వెంకటాపూర్ మండల బబి సెల్ అధ్యక్షులు-మూడ్ వీరేశ్, వెంకటాపూర్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి-బూస గణేష్ ఖంఅూ చైర్మన్-మాడుగుల రమేష్,లక్ష్మీదేవిపేట మాజీ ఎంపీటీసీలు బానోతు భాస్కర్,వత్తిరీ దశరథం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల రాజయ్య,గోస్కుల తిరుపతి,లక్ష్మీదేవిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, యూత్ నాయకులు,మహిళా సోదరిమణులు, పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.